MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

apmas

సంపుటి : 25 సంచిక: 1 రంగారెడ్డి సెప్టెంబర్ 2026 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఏపిమాస్‌కు ప్రశంసాపత్రం!



' రాయలసీమ జల సిరి (ఆర్ డబ్ల్యు ఐ)'
ఉత్తమ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన
తరగతుల శాఖ మంత్రి శ్రీమతి ఎస్ సవిత నుంచి
ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న
ఏపిమాస్ ప్రతినిధి శ్రీ అమరేంద్ర



' ఎఫ్ పి ఓల ఏర్పాటు విధాన ప్రక్రియ '
చిరు పుస్తకాన్ని
తెలంగాణా వ్యవసాయ శాఖ మంత్రి
శ్రీ తుమ్మల నాగేశ్వర రావుకు
అందజేసిన నాబార్డ్ తెలంగాణా
సి జి ఎం శ్రీ ఉదయ భాస్కర్,
జి ఎం శ్రీమతి రామలక్ష్మి,
ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి

## ఎఫ్ పి ఓల సి ఇ ఓ లకు సమగ్ర శిక్షణ !







ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎఫ్ పి ఓల సి ఇ ఓలకు సమగ్ర శిక్షణ దృశ్యాలు.
శిక్షణలో పాలుపంచుకున్న ఏపిమాస్ పాలకవర్గం ... శిక్షణలో పాల్గొన్న
తెలంగాణా వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి శ్రీ సురేంద్ర మోహన్‌కు సన్మానం



## జాంబియా ప్రతినిధివర్గం పర్యటన

ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం తీరుతెన్నులను
అధ్యయనం చేయడానికి జాంబియా నుంచి
వచ్చిన ప్రతినిధివర్గం పర్యటన దృశ్యాలు.
ఈ పర్యటనను ఏపిమాస్ సమన్వయ పరుస్తున్నది.





ఏపిమాస్ శిక్షణ పొందిన తెలంగాణా ' సెర్ప్ ' ఎఫ్ పి ఓల ఏ పి ఎంలు

NABARD

నాబార్డ్ సౌజన్యంతో ....

# నేల ఆరోగ్యం - ఉత్పాదకత పెంపుదల

ఆరోగ్యంగా ఉన్న నేలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే బలం ఉంటుంది
నేల ఆరోగ్యంగా ఉండాలంటే, అందులో తగినంత సేంద్రియ పదార్థం ఉండాలి

## చేపట్టే పనులు



లోతుగా దుక్కులు దున్నడం



మల్చింగ్



పొలంలో పచ్చి రొట్ట ఎరువు సాగు



వైవిధ్య పంటల సాగు



చెరువు మట్టి చల్లడం



పంటలమార్పిడి



జీవ ఎరువుల వాడకం



నాణ్యమైన విత్తనాల వాడకం

NABARD

# మహిళా సాధికారత

సంపుటి 25 సంచిక 1



సంపాదకీయం

## బహుపరాక్ !

ప్రళయం అంటే ఏమిటో, విలయం ఎలా వుంటుందో ఆగస్టు నెలలో హఠాత్తుగా విరుచుకుపడి, హిమాలయోత్తుంగ తరంగ ప్రచండ వేగంతో నేపాల్‌ను కకావికలంచేసిన జలప్రళయం రేఖా మాత్రంగా మన కళ్ళకు కట్టించింది. ఇళ్ళకు యిళ్ళు, ఊళ్ళకు ఊళ్ళు వరదపాలైనాయి. తాజా సమాచారం ప్రకారం కనీసం వెయ్యిమంది ప్రాణాలు కోల్పోగా, నాలుగువేల మంది జాడ తెలియడం లేదు. 22 వేల మంది పిల్లలతో సహా 60 వేల మందికి పైగా వరద బీభత్సానికి గురయ్యారు. ఇంతకూ యింతటి మహా విపత్తు ఎలా సంభవించింది? నేపాల్ – టిబెట్ సరిహద్దులో హిమాలయ పర్వత శ్రేణిలోని దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల వెడల్పు కలిగిన భారీ హిమఖండం దాదాపు ఐదు కిలోమీటర్ల ఎత్తునుంచి గంటకు 193 కిలోమీటర్ల ప్రచండ వేగంతో, దాదాపు రెండు కిలోమీటర్ల దిగువన వున్న లోయలో ఒక్కసారిగా కుప్పకూలడంతో ఈ ఘోర విపత్తు సంభవించిందని అంతర్జాతీయ సమీకృత పర్వతాభివృద్ధి కేంద్రం (ఐ సి ఐ ఎం ఓ డి), అంతర్జాతీయ భూగోళ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. పెట్టని కోటగోడ లాంటి హిమాలయాలు బీటలు వారుతున్నాయా? ప్రకృతి యింత వికృతంగా మారడానికి కారణం ఏమిటి? ఇది శాపమా? లోపమా? ఇప్పుడు మరో ఘోర విపత్తును గురించి చూద్దాం. ఇది నేపాల్ జల ప్రళయంలా కంటికి కనిపించేది కాదు. కాని, వాతావరణ క్రమాన్ని దెబ్బతీసి, లక్షలు, కోట్ల మంది జీవితాలతో చెలగాటమాడుతుంది. అదే ఎల్ నినో! ఎక్కడో పసిఫిక్ మహాసముద్రంలో అల్లకల్లోలం ఏర్పడి, ప్రపంచమంతటా తన దుష్ప్రభావాన్ని చూపుతుంది. ఈ ఎల్ నినో ప్రభావంతో వాతావరణ వైపరీత్యాలు సంభవిస్తాయి. కొన్ని చోట్ల కుంభ వృష్టి కురిస్తే, మరికొన్ని చోట్ల బొత్తిగా వాన కురవదు. ఆతివృష్టి, అనావృష్టి … రెండూ ప్రజల జీవనాన్ని ఛిన్నా భిన్నం చేసేవే. ఇప్పుడు మన రెండు తెలుగు రాష్ట్రాలు ఎల్ నినో బారినపడి విలవిలలాడుతున్నాయి. సంవత్సరంలో ఎక్కువ వర్షపాతం కురిసే నైరుతీ రుతుపవన తరుణం ఈసారి వానలు లేక వెలవెలపోయింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్ లో 51శాతం, తెలంగాణాలో 31శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ లో 21శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. కేవలం వరి సాగు విస్తీర్ణమే దాదాపు లక్షన్నర హెక్టార్లు తగ్గిందని అంచనా. ఇంతటి స్థాయిలో పంట నష్టంతో రైతుల వెన్ను విరిగినట్టే కదా! పంట కొరతతో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరిగి ప్రజల జీవితాలు కూడా భారంగా మారుతాయి. ఇదీ ఎల్ నినో దెబ్బ! ఇలా ఎల్ నినో ఏర్పడడానికి, మన జీవితాలతో చెలగాటమాడడానికి కారణం ఏమిటి? అటు నేపాల్ జలప్రళయానికి కారణం ఏమిటి? అంటే …అన్ని వేళ్ళు మననే చూపిస్తున్నాయి. మనం అంటే మొత్తం మన సమాజం. వాతావరణ కాలుష్యంవల్ల భూమి, సముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగి, ఈ విపత్తులు సంభవిస్తున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మితిమీరిన రసాయనాల వాడకంవల్ల పంట పొలాలు విషపూరితమవుతున్నాయి. మేఘాలను ఉత్తేజితంచేసి వానలు కురవడానికి దోహదంచేసి, నేలను చల్లబరచే చెట్లను విచక్షణా రహితంగా నరికివేస్తుండడంతో భూతాపం పెరిగిపోతున్నది. నిత్యజీవనంలో సహజత్వం సన్నగిలి, కృత్రిమత్వం పెచ్చుమీరడం ప్రధాన సమస్య. ఈ కారణంగా, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. పోగొట్టుకున్నచోటనే వెతుక్కోమన్నట్టు, ఈ ప్రకృతి బీభత్సానికి విరుగుడు ప్రకృతి సంరక్షణలోనే వుంది. విస్తృతంగా చెట్లు పెంచడం, రసాయనిక సేద్యానికి స్వస్తిచెప్పి, ప్రకృతి(సహజ) వ్యవసాయానికి మళ్ళడం అవసరం. విదేశీయులు సైతం మన ప్రకృతి వ్యవసాయ విధానాలపట్ల ఆసక్తి చూపుతుంటే, మనం మాత్రం యింకా ఆ వైపు మళ్ళడానికి అంతగా ఆసక్తి చూపకపోవడం విచారకరం. ఆ జలప్రళయం, ఈ ఎల్ నినో మన కళ్ళు తెరిపిస్తాయని ఆశిద్దాం.

Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy

చుక్కాని తిప్పగలిగే సామర్థ్యమున్నవారికి గాలి అనుకూలిస్తుంది, అలలూ అనుకూలిస్తాయ్

# మహిళా సాధికారత



ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి: **జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సాంకేతిక సహకారం : క్రిస్టాఫర్ వసంత్**

## లోపలి పేజీలలో ....

➪ ఎఫ్‌పిఓ-సిఇఓలకు సామర్థ్యాభివృద్ధి శిక్షణ 05
➪ జాంబియా బృందం అధ్యయనం 07
➪ తూర్పుగోదావరి జిల్లాలో 'వాష్' కార్యశాల 09
➪ పాలిచ్చే తల్లికి సమాజ సహకారమూ అవసరమే 11
➪ బోరుబావితో తాగునీటి సమస్య పరిష్కారం! 14
➪ సెర్ప్ ఎఫ్‌పిఓల ఏపియంలకు సమగ్ర శిక్షణ 16
➪ మహిళలు బ్యాంక్ రుణాలలో ఏపీ టాప్ ! 20
➪ ఔషధ ఉల్లి సాగుతో అధిక ఆదాయం! 21
➪ ఒక ఎఫ్ పి ఓ ప్రగతి ప్రస్థాన ప్రదర్శన ! 22
➪ డ్వాక్రా మహిళలకు తాకట్టు లేకుండా రూ.20లక్షల రుణం 25
➪ ఇంట్లో వాననీటి బ్యాంకు ఉందా? 27
➪ వరికొయ్యలను పొలంలోదున్నితే పంటకు మేలు 28
➪ మహిళల భద్రత సమాజ బాధ్యత కూడా ... ! 29
➪ 10జిల్లాల రైతుల పంట ఉద్యానహబ్ 31
➪ అన్నదాతకు వరం.. పి ఎం కిసాన్ మాన్‌ధన్! 32
➪ ఒకే పొలంలో వరి, చేపలు, పాడీ మోడల్ 33
➪ కడప రైతు వరదారెడ్డికి ప్రధాని మోదీ కితాబు 34
➪ డిజిటల్ బాటలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ 34

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పని చేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతో పాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం 'మహిళా సాధికారత' పత్రికతో పాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన చార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

ఒడ్డున నిలిచి యెంతకాలం అలలను చూసినా సముద్రాన్ని దాటలేవు, దాటించే మార్గమేదో అనుసరిస్తే తప్ప...

# ఆంధ్రప్రదేశ్ ఎఫ్ పి ఓ - సి ఇ ఓలకు సామర్థ్యాభివృద్ధి శిక్షణ

–మహేష్ అలగప్ప



రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో (ఎఫ్ పి ఓ లలో) 'వేగవంతమైన అభివృద్ధి' (యాక్సిలరేషన్) కోసం 'భారతీయ స్టేట్ బ్యాంక్ ఫౌండేషన్' కార్యక్రమం కింద ఎంపికైన ఎఫ్ పి ఓల సి ఇ ఓ లకు (ముఖ్య కార్యనిర్వహణాధికారులకు) మూడు రోజుల సామర్థ్య నిర్మాణ శిక్షణా కార్యక్రమాన్ని 2026 ఆగస్టు 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు హైదరాబాద్ లోని ఏపిమాస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎఫ్ పి ఓ లకు చెందిన 28 మంది ముఖ్య కార్యనిర్వహణాధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో బలమైన, స్థిరమైన, ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించిన రైతు ఉత్పత్తిదారుల సంస్థలను నిర్మించేందుకు అవసరమైన వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా ఆర్థిక నిర్వహణ, సంస్థ మొత్తం వ్యాపార లావాదేవీలను పెంచడం, నికర లాభాలను మెరుగుపరచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అంతేకాకుండా వ్యయ సమతుల్య స్థాయి విశ్లేషణ, వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు అయ్యే వ్యయాన్ని లెక్కించడం, వాటికి తగిన ధరలను నిర్ణయించడం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.

శిక్షణ తరగతులు పూర్తిగా ఆచరణాత్మక పద్ధతిలో నిర్వహించారు. ప్రతి ఒక్కరు తమ ఎఫ్ పి ఓ లకు సంబంధించిన వాస్తవ సమాచారాన్ని ఉపయోగించి ఆర్థిక లెక్కలను పరిశీలించారు. తమ సంస్థల వ్యాపార కార్యకలాపాలు, వ్యయాలు, ఆదాయాలు, లాభనష్టాలను విశ్లేషిస్తూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ సంస్థలకు ఎలా అన్వయించుకోవచ్చో స్వయంగా అభ్యసించారు. ఈ విధానం ద్వారా తమ సంస్థల ఆర్థిక పరిస్థితిని మరింత స్పష్టంగా అర్థం చేసుకోవడంతో పాటు, వ్యాపారాభివృద్ధి, లాభదాయకతను పెంచుకునే మార్గాలపైవారికి మంచి అవగాహన ఏర్పడింది.

**ఏపిమాస్ పాలక మండలితో చర్చలు**

ఈ కార్యక్రమంలో మరో ప్రత్యేక అంశం ఏపిమాస్ పాలక మండలి (డైరెక్టర్ల బోర్డు) సభ్యులతో రైతు ఉత్పత్తిదారుల సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారులకు జరిగిన పరస్పర సమావేశం. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ, "మేము నిపుణులైన వృత్తిపరుల బృందంతో మాట్లాడుతున్నామనే అనుభూతి కలిగింది" అని పేర్కొనడం ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది.

రైతు ఉత్పత్తిదారుల సంస్థల నాయకత్వంలో పెరుగుతున్న వృత్తిపరమైన నైపుణ్యం, నిర్వహణ సామర్థ్యం, బాధ్యతాయుతమైన నాయకత్వానికి ఇది ఒక ముఖ్యమైన గుర్తింపుగా నిలిచింది.

గెలుపేకాదు, అప్పుడప్పుడూ ఓటమికూడా అవసరమే లేకుంటే నాణాకి రెండోవైపు ఏముందో ఎలా తెలుస్తుంది?



**శ్రీ సురేంద్ర మోహన్ సలహాలు**

కార్యక్రమంలో మరో ముఖ్యమైన అంశం తెలంగాణా ప్రభుత్వ వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి శ్రీ సురేంద్ర మోహన్‌తో జరిగిన యిష్టాగోష్ఠి.

ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు కనీస మద్దతు ధర ఆధారంగా జరిగే ప్రభుత్వ కొనుగోళ్లలో మధ్యవర్తులుగా కాకుండా, ప్రత్యక్ష కొనుగోలు సంస్థలుగా మరింత బలమైన పాత్ర పోషించే అవకాశాలను శ్రీ సురేంద్ర మోహన్ వివరించారు. దీనివల్ల రైతులు వ్యవస్థీకృత కొనుగోలు వ్యవస్థలను మరింత సులభంగా చేరుకోవడంతో పాటు, తమ వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ లభించి, రైతుల ఆదాయాలను పెంచుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారులు తమ క్షేత్రస్థాయి అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, సాధించిన పురోగతి మరియు తమ అభిప్రాయాలను ప్రభుత్వంలోని ఒక ఉన్నతస్థాయి అధికారితో నేరుగా పంచుకునే అవకాశం పొందారు.

ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారులు తమ క్షేత్రస్థాయి అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, సాధించిన పురోగతి మరియు తమ అభిప్రాయాలను ప్రభుత్వంలోని ఒక ఉన్నతస్థాయి అధికారితో నేరుగా పంచుకునే అవకాశం పొందారు. ఈ పరస్పర చర్చ ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థల వాస్తవ పరిస్థితులు, వాటి అవకాశాలు, ఎదుర్కొంటున్న సవాళ్లపై పరస్పర అవగాహన మరింత పెరిగింది.

మొత్తంగా, ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం రైతు ఉత్పత్తిదారుల సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారుల్లో వ్యాపార నిర్వహణపై అవగాహన, ఆర్థిక నిర్వహణ సామర్థ్యం, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, వృత్తిపరమైన



నాయకత్వ లక్షణాలను మరింత బలోపేతం చేసింది.

అదే సమయంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, అభివృద్ధి సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థల మధ్యసమన్వయం, పరస్పర అవగాహన, సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం ఒక విలువైన వేదికగా నిలిచింది. ■

# ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై జాంబియా బృందం అధ్యయనం



**ఆం**ధ్రప్రదేశ్‌లో రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ పద్ధతులు, వినూత్న ప్రయోగాలు, సుస్థిర వ్యవసాయ విధానాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు జాంబియాకు చెందిన ఎనిమిది మంది సభ్యుల ప్రతినిధి బృందం శ్రీ సత్యసాయి జిల్లాలోని సహజ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది.

వ్యవసాయ పర్యావరణ ఆధారిత, వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయంపై దక్షిణ-దక్షిణ సహకార కార్యక్రమంలో భాగంగా ఈ ప్రతినిధి బృందం ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఈ పర్యటనకు జర్మన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జి ఐ జడ్) సహకారం అందిస్తుండగా, ఏపిమాస్ సమన్వయం చేస్తోంది. అనంతపురం ప్రాంతంలో 'ఆంధ్రప్రదేశ్ సమాజ ఆధారిత సహజ వ్యవసాయ కార్యక్రమం' (ఏ పి సి ఎన్ ఎఫ్), ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ సహకరిస్తున్నాయి.

ఈ ప్రతినిధి బృందంలో జాంబియా వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన షాడ్రెక్ మ్వాలే, ముకేలా ఎలిజబెత్ లుబాసి, చిజుంబా షెపాండే, బార్బ్రా ముకునితో పాటు, పర్యావరణ ఆధారిత భూవినియోగ నిర్వహణ సంస్థకు చెందిన ఎటినాలా టెంబో, జాంబియా చిన్న తరహా రైతుల జాతీయ సమాఖ్యకు చెందిన ఎబోనీ లోలోజి, జర్మన్



సానబెట్టందే వజ్రం ధగధగ మెరవదు, రాటుతేలందే మనిషికి రాణింపు రాదు

అంతర్జాతీయ సహకార సంస్థకు చెందిన బెలిండా చిలాలా, ఇమ్మాన్యుయేల్ న్గోమా ఉన్నారు.

రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ , ఇన్నోవేషన్ ఆఫీసర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ లక్ష్మానాయక్,ఆ సంస్థకు చెందిన నిపుణులు శ్రీ సుధాకర్, శ్రీ సురేష్, స్వాతి, యితర సిబ్బంది, జిల్లా స్థాయి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపిమాస్ ప్రతినిధులు శ్రీమతి కళామణి, శ్రీమతి రమాదేవి క్షేత్ర సందర్శనను సమన్వయం చేసి, జాంబియా ప్రతినిధి బృందంతో చర్చలు జరిపారు.



వ్యవసాయ పర్యావరణ విధానాలను, వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భారతదేశం సాధించిన అనుభవాన్ని అర్థం చేసుకోవడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.

ముఖ్యంగా సమాజ ఆధారిత విధానాలు, సంస్థాగత వ్యవస్థలు, శాస్త్రీయ ఆధారాలు, రైతులకు విస్తరణ సేవలు, ఆర్థిక సహాయం, భాగస్వామ్య వ్యవస్థల వంటి అంశాల ద్వారా సుస్థిర వ్యవసాయ పద్ధతులను విస్తృత స్థాయిలో అమలు చేయడానికి అవసరమైన మార్గాలను ప్రతినిధి బృందం అధ్యయనం చేస్తోంది.

జాంబియా తన తొలి జాతీయ వ్యవసాయ పర్యావరణ వ్యూహాన్ని రూపొందించుకుంటున్న సందర్భంలో ఆంధ్ర ప్రదేశ్‌లో అమలవుతున్న సహజ వ్యవసాయ విధానంపై జాంబియా బృందం జరుపుతున్న ఈ అధ్యయనం, ఆ దేశానికి ఆచరణాత్మకమైన, విలువైన అనుభవాలను అందిస్తుందని భావిస్తున్నారు.

క్షేత్రస్థాయి కార్యక్రమంలో భాగంగా ప్రతినిధి బృందం సహజ వ్యవసాయంలోని తొమ్మిది సార్వత్రిక సూత్రాలపై నిర్వహించిన ప్రదర్శనలను పరిశీలించింది. ముఖ్యంగా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానాలను ప్రత్యక్షంగా గమనించింది. శ్రీ లక్ష్మా నాయక్ సహజ వ్యవసాయంలో జీవ ఉత్ప్రేరకాల పాత్రను, నేల ఆరోగ్యం, పంటల పెరుగుదలను మెరుగు పరచడంలో వాటి ప్రాధాన్యతను వివరించారు.

అనంతరం బృందం గంతపురం గ్రామంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న సహజ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది.

స్వయం సహాయ సంఘాలు, గ్రామ సంఘాలసమాఖ్యల ప్రతినిధులతో ప్రతినిధి బృందం సమావేశమై, విభిన్న రకాల పంటల సాగు విధానాలు, వ్యవసాయ కుటుంబాలకు నిరంతర ఆదాయం కల్పించేందుకు అనుసరిస్తున్న వ్యూహాల గురించి తెలుసుకుంది. వివిధ రకాల పంటలు, భిన్నమైన వ్యవసాయ పరిస్థితుల్లో రైతులు సహజ వ్యవసాయ పద్ధతులను ఏ విధంగా అనుసరిస్తున్నారో ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఈ క్షేత్ర సందర్శనలు ప్రతినిధి బృందానికి మంచి అవకాశాన్ని కల్పించాయి. ■

అసలే చెదిరిపోయే కల, ఆపైన దానికి ఒక నీడ అయినా ఆశాజీవికి చిరు ఆధారంచాలు, ముందుకు సాగడానికి..

# తూర్పు గోదావరి జిల్లాలో 'వాష్' కార్యశాల

**– రాజోజుల బ్రహ్మాచారి**

**తూ**ర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం పట్టణం, బొమ్మూరులోని మెప్మా కార్యాలయ సమావేశ మందిరంలో 'నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత' (వాష్)పై జిల్లాస్థాయి కార్యశాలను ఇటీవల నిర్వహించారు. వాటర్ ఆర్గ్ సంస్థ మద్దతుతో, ఏపిమాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించ బడింది. కార్యక్రమానికి మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ కనకరాజు , జిల్లా వైద్యాధికారి శ్రీమతి పి.కోమల, ఏపిఎం హెచ్ఆర్ నాగలక్ష్మి గారు, సిఎంఎం రామలక్ష్మి గారు, ఎల్హెచ్ శ్రీదేవి గారు, ఏపిమాస్ వాష్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మాచారి, జిల్లా వాష్ ప్రాజెక్ట్ అధికారి శ్రీమతి చంద్రకాంతం తదితరులు ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు. మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ కనక రాజు జ్యోతి ప్రజ్వలన చేయడంతో కార్యక్రమం ప్రారంభమైంది.



### వాష్ అలవాట్లు దినచర్యగా మారాలి

శ్రీ కనకరాజు గారు మాట్లాడుతూ, సురక్షితమైన తాగునీటి వినియోగం, నీటిని శుద్ధి చేసుకోవడం, మరుగుదొడ్లను సక్రమంగా ఉపయోగించడం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలు ప్రతి కుటుంబంలో రోజువారీ అలవాట్లుగా మారాలని అన్నారు. వాష్పై అవ గాహన కల్పించడం ఒక్కసారి నిర్వహించే కార్యక్రమంతో పూర్తికాదని, ప్రజలకు నిరంతరం సమాచారం అందిస్తూ, వారితో మమేకమై ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించాలని సూచించారు.

జిల్లాలోని అన్ని పట్టణాల సంఘాల్లో ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్స్ (ఆర్ పిల) ద్వారా వాష్ ప్రాముఖ్యతను విస్తృతంగా వివరించాలని, ఏపిమాస్ వంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరిన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

### పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యం

జిల్లా వైద్యాధికారి శ్రీమతి పి. కోమల మాట్లాడుతూ, ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసు కోవాలని, నిల్వ నీటివల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, చికున్గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే

సమస్యలను కొని తెచ్చుకోవడమే నీ స్వభావమైతే అలానే చెయ్, కానీ, ఆ సమస్యలను నీ పొరుగువారికి అంటించకు

అవకాశం ఉందని తెలిపారు. మరుగుదొడ్లు, మురుగునీటి కాలువలు శుభ్రంగా ఉంచుకోవడం, పరిసరాలను పొడిగా, పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని చెప్పారు.

ముఖ్యంగా మహిళా సంఘాల సభ్యులకు పారిశుధ్యం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. వర్షాకాలంలో విషజ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున సమతుల్య ఆహారం తీసుకోవడం, రక్తహీనత నివారణకు జాగ్రత్తలు పాటించడం, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి అంశాలను వివరించారు.



'వాష్' అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మచారి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా స్థాయి కార్యశాల ఉద్దేశం, కార్యక్రమాల లక్ష్యాలు, వాష్ ప్రాజెక్ట్ కార్యాచరణ, ఏపిమాస్ పాటించే విలువలను, దీర్ఘకాలిక అనుభవాలను వివరించారు.

ఇంట్లో తాగునీటిని శుద్ధి చేయడం, తగిన విధంగా నిల్వ చేయడం, నీటి నాణ్యతపై అవగాహన కలిగి ఉండటం వంటి అంశాలను వివరించారు. నీటిలో కరిగి ఉండే ఖనిజాలు, లవణాల పరిమాణాన్ని టీ డి ఎస్ (టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్స్) మీటర్ ద్వారా తెలుసుకోవచ్చని, నీటి నాణ్యతను శాస్త్రీయంగా పరీక్షించుకోవడం అవసరమని వివరించారు.

పారిశుధ్యం లోపం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక , ఆర్థిక ప్రభావాలను కూడా ప్రజెంటేషన్‌లో వివరించారు. సురక్షితమైన మరుగుదొడ్ల వినియోగం, బహిరంగ మలవిసర్జన నివారణ, మురుగునీటి సక్రమ నిర్వహణ వంటి అంశాలను ప్రత్యేకంగా వివరించారు.

**వాష్ రుణాలతో కుటుంబాలకు ఆర్థిక సహాయం**

సురక్షితమైన నీరు , పారిశుధ్య సౌకర్యాల ఏర్పాటుకు ఆర్థిక వనరుల కొరత ఒక ప్రధాన అవరోధమని, ఈ సమస్యను అధిగమించేందుకు వాష్ రుణాల ద్వారా కుటుంబాలకు అవసరమైన నీటి సౌకర్యాలు, మరుగుదొడ్లు, ఇతర వాష్ మౌలిక వసతులను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు శ్రీ బ్రహ్మచారి వివరించారు.

చిన్న మొత్తాల్లో, సులభంగా తిరిగి చెల్లించగల రుణాల ద్వారా కుటుంబాల అవసరాలకు అనుగుణంగా వాష్ సౌకర్యాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలలో ఒకటని పేర్కొన్నారు.

తూర్పు గోదావరి జిల్లాలోని పట్టణాలు, మండలాల్లో వి ఓ ఏలు, ఆర్ పి లకు వాష్ అంశాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అర్హత కలిగిన కమ్యూనిటీ నీటి శుద్ధి ప్లాంట్లకు ఏపిమాస్ గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు సబ్సిడీ, కమ్యూనిటీ బోర్‌వెల్ ఏర్పాటుకు 25,000 రూపాయల నుంచి 30,000 రూపాయల వరకు సహాయం అందించే అవకాశం ఉందని వివరించారు. జిల్లా వాష్ ప్రాజెక్ట్ అధికారి శ్రీమతి చంద్రకాంతం వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

■

**గంటలకొద్దీ ఏకరువు పెట్టినా బోధపడని విషయం, ఒక చక్కని ఉదాహరణతో సులువుగా అర్థమవుతుంది**

# పాలిచ్చే తల్లికి సమాజ సహకారమూ అవసరమే!

- జాహ్నవి, భవాని

**త**ల్లి తన బిడ్డకు తాను పాలు యివ్వడానికి మనం తగిన తోడ్పాటు అందిస్తున్నామా? తల్లిపాల గురించి మాట్లాడేటప్పుడు, తరచుగా దాన్ని "తల్లి తీసుకునే ఒక నిర్ణయం"గా మాత్రమే చూస్తుంటాం. కాని నిజానికి, తల్లి నిర్ణయం అనేది వాస్తవ పరిస్థితిలో ఒక భాగం మాత్రమే. ఒక తల్లి తన బిడ్డకు తాను పాలు యివ్వాలని కోరుకోవచ్చు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి ఆమెకు పూర్తి అవగాహన వుండవచ్చు. అయినప్పటికీ, తన చుట్టూ అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం, ప్రోత్సాహం లేకపోతే తల్లిపాలను కొనసాగించడం ఆమెకు కష్టంగా మారవచ్చు.

బిడ్డ పుట్టిన తొలి రోజులు ప్రతి తల్లికీ ఎంతో కీలకమైనవి. అదే సమయంలో అనేక సవాళ్లు ఎదురవుతాయి. ఒకవైపు ఎన్నో రకాల సలహాలు అందుతుంటాయి. ఆరోగ్య సిబ్బందికి ప్రతి తల్లితో కూర్చొని తల్లి పాలు పట్టించే సరైన పద్ధతి, శిశువు పట్టుకునే విధానం లేదా ఎదురవుతున్న సమస్యలను వివరంగా తెలుసుకునేంత సమయం ఉండక పోవచ్చు. కుటుంబ సభ్యులు సహాయం చేయాలని అను కున్నా, ఎలా సహాయం చేయాలో వారికి సరైన అవగాహన లేకపోవచ్చు. తల్లి ఉద్యోగస్తురాలైతే, తిరిగి ఉద్యోగానికి వెళ్లాల్సి వచ్చినప్పుడు తల్లి పాలను కొనసాగించడం మరింత సవాలుగా మారుతుంది.

**తల్లిపాలు యివ్వడంలో తగ్గుదల**

మనదేశంలో ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు అందించే పరిస్థితిలో వచ్చిన తగ్గుదల మనం మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. 2019-21 మధ్యకాలంలో నిర్వహించిన 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5' (NFHS-5) మనదేశంలో 63.7% మంది పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందుతున్నాయని చెప్పింది. అయితే, 2023-24 లో నిర్వహించి, తాజాగా విడుదలైన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6' ప్రకారం ఆరు నెలల వరకు తల్లిపాలు పొందుతున్న శిశువుల శాతం 55.8 కి తగ్గిపోయింది! ఇందుకు బాధ్యత తల్లులదని ఈ సర్వే పేర్కొనలేదు. మరి ఎవరు దీనికి బాధ్యత వహించాలి?

**తల్లులకు ఏదైనా సహకారం అందుతోందా?**

- తల్లిపాలు ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు ఆరోగ్య కేంద్రాలు తల్లులకు అవసరమైన ఆచరణాత్మక సహాయాన్ని అందిస్తున్నాయా?
- క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలకు తల్లుల సమస్యలను వినడానికి, అవసరమైన సూచనలు యివ్వడానికి, తరువాత వారిని గమనించడానికి తగిన సమయం, నైపుణ్యాలు ఉన్నాయా?




- కుటుంబ సభ్యులు తల్లికి ఒత్తిడిని కలిగిస్తున్నారా? లేక ఆమెకు సహకరిస్తున్నారా?
- తల్లులకు తమ సమాజంలో అవసరమైన సహాయం, మార్గదర్శకత్వం అందుబాటులో ఉందా?
- తల్లి తిరిగి ఉద్యోగంలో చేరినప్పుడు, తల్లిపాలను కొనసాగించేందుకు అవసరమైన సమయం, సౌకర్యం, పని ప్రదేశంలో అనుకూలమైన వాతావరణం లభిస్తున్నాయా?

**తల్లిపాల వారోత్సవం**

'తల్లిపాలకు ప్రాధాన్యత ఇవ్వండి: స్థిరమైన సహాయక వ్యవస్థలను నిర్మించండి' ('ప్రయారిటైజ్ బ్రెస్ట్ ఫీడింగ్ : క్రియేట్ సస్టెయినబుల్ సపోర్ట్ సిస్టమ్స్') అనేది 2026 వ సంవత్సరం 'అంతర్జాతీయ తల్లిపాలవారోత్సవ' (ఆగస్ట్ 1-

7 వరకు) నినాదం.ఈ నినాదాన్ని కేవలం ఒక వారపు ప్రచారంగా కాకుండా, తల్లికి అవసరమైన సమయంలో అవసరమైన సహాయం అందించే సమగ్ర వ్యవస్థను బలోపేతం చేయాలనే సందేశంగా ఏపిమాస్ తీసుకుంది. ఏపిమాస్ పట్టణ పోషణ పథకం బృందం 'విప్రో కేర్స్' మద్దతుతో మాతా శిశు సంక్షేమ శాఖ, వైద్య–ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, సుషేనా ఫౌండేషన్ – ధాత్రి తల్లిపాల బ్యాంక్ సహకారంతో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించింది.

**600 మంది భాగస్వామ్యం**

ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించిన కార్యక్రమాల్లో 600 మందినేరుగా భాగస్వాములయ్యారు. ఇందులో 225 మంది తల్లులు , సంరక్షకులు, 300 మంది కిశోరులు, 50 మంది స్వయం సహాయక సంఘసభ్యులు , పాలిచ్చే తల్లులు, 20 మంది ఆశా కార్యకర్తలు , ఏఎన్ఎమ్ లు ఉన్నారు.

**ఆసుపత్రుల్లో తల్లులతో ప్రత్యక్షంగా**

నీలోఫర్ ఆసుపత్రిలో వారోత్సవ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా 2 కి.మీ. తల్లిపాల అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. అనంతరం మూడు నవజాత శిశువుల వార్డ్ లో ఉన్న దాదాపు 120 మంది ప్రసవానంతర తల్లులతో, సంరక్షకులతో నేరుగా మాట్లాడి, తల్లిపాలపై వారి సందేహాలను నివృత్తి చేయడం జరిగింది.

కోటీలోని గవర్నమెంట్ ప్రసూతి ఆసుపత్రిలో దాదాపు 40 మంది తల్లులకు తల్లిపాలపై సలహాలు, సూచనలు అందించడం జరిగింది. సరైన పాలిచ్చే భంగిమ, పుట్టిన వెంటనే గంట లోపలనే తల్లిపాలు యివ్వాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే యివ్వాలని వివరించడంతో పాటు, తల్లి తీసుకోవలసిన పోషకాహారంపై ఆచరణాత్మక సూచనలు అందించారు.

**తల్లుల సమావేశాలు – ప్రశ్నలకు సమాధానాలు**

కార్వాన్–2 అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లుల సమావేశంలో తల్లులు తమ అనుభవాలను పంచుకుని, తల్లిపాలపై తమ సందేహాలను స్వేచ్ఛగా అడిగారు. ఈ సమావేశాలు ఒక ముఖ్యమైన విషయాన్ని తెలియజేశాయి. తల్లికి సమాచారం చెప్పడం మాత్రమే కాదు, ఆమె చెప్పేది వినడం కూడా అంతే ముఖ్యమని.

**క్షేత్ర స్థాయి కార్యకర్తలను బలోపేతం చేయడం**

తల్లులకు నిరంతర సహాయం అందించడంలో ఆశాలు కీలక పాత్ర పోషిస్తారు. అందుకే ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ముందస్తుగా గర్భిణి పేరు నమోదు, పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించడం, తల్లి పాలు, పోతపాలు రెండూ యివ్వడాన్ని (మిక్స్‌డ్ ఫీడింగ్‌ను) నిరుత్సాహపరచడం, గర్భిణి, బాలింత తీసుకోవలసిన ఆహారం వంటి అంశాలపై చర్చించారు. తల్లులను, కుటుంబాలను నిరంతరం ప్రోత్సహిస్తున్న ఆశాలను "స్టార్ ఆశా" గుర్తింపుతో సత్కరించడం ద్వారా వారి కృషిని అభినందించారు.

**అవగాహనకు తోడు ఆచరణాత్మక మార్గదర్శకత్వం**

ధాత్రి హ్యూమన్ మిల్క్ బ్యాంక్ సహకారంతో పాలిచ్చే తల్లులకు సరైన పాలిచ్చే విధానాన్ని, ఏవిధంగా పట్టుకోవాలో ప్రత్యక్షంగా ప్రదర్శించారు. నెల తక్కువ, తక్కువ బరువుతో పుట్టిన, పిల్లలకు తల్లిపాలు ఎంత ఉపయోగమో వివరించారు. ఇలాంటి ప్రదర్శనలు తల్లులు 'ఏం చేయాలి, ఏం చేయకూడదు' అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం యిస్తాయి.

**కిశోరులు – భవిష్యత్తు మార్పుకు భాగస్వాములు**

తల్లిపాలపై అవగాహనను కేవలం తల్లులకే పరిమితం చేయకుండా, కిశోరులను కూడా ఈ చర్చలో భాగస్వాములను చేయడం కార్యక్రమంలోని మరో ప్రత్యేకత. పాఠశాలల్లో సుమారు 300 మంది కిశోరులతో సమతుల్య పోషకాహారం, రక్తాన్ని పెంచే ఇనుము అధికంగా ఉన్న ఆహారాలు మరియు కిశోరి పోషణపై చర్చ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తల్లిపాలపై అవగాహన ర్యాలీల్లో పాల్గొని సమాజానికి సందేశాన్ని చేరవేశారు. 'తల్లిపాలపై సహాయక వాతావరణం బిడ్డ పుట్టిన తర్వాత మాత్రమే కాదు, సమాజంలో అవగాహన పెరిగి నప్పుడే ఏర్పడుతుంది అనే ముఖ్యమైన సందేశాన్ని యివి అందిస్తాయి.

**సంఘాలు, సమాఖ్యలు నుంచి సమాజానికి సందేశం**

సాయినగర్–2లో సంఘ సభ్యులతో, పాలిచ్చే తల్లులతో

**తను పడే పాట్ల నుంచే కాదు, ఇతరుల వైఫల్యాల నుంచి కూడా పాఠాలు నేర్చుకోవడం వివేకవంతుల లక్షణం**

నిర్వహించిన సమావేశంలో తల్లిపాల ప్రాముఖ్యతతో పాటు, ఈ సందేశాలను కుటుంబ సభ్యులకు, సమాజంలోని ఇతరులకు చేరవేయాలని మహిళలను ప్రోత్సహించడం జరిగింది. తర్వాత నిర్వహించిన అవగాహన ర్యాలీలో మహిళలు నినాదాల ద్వారా తల్లిపాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు.

**తల్లి... కుటుంబం... సమాజం**

తల్లి తన బిడ్డకు తాను పాలు యివ్వాలంటే ...

ఆరోగ్య కార్యకర్తలు వినాలి, కుటుంబం అర్థం చేసుకోవాలి, భర్త – కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలి, సమాజం సహకరించాలి, పని ప్రదేశాలలో అనుకూల వాతావరణం కల్పించాలి, అవసరమైన సమయంలో ఆరోగ్య వ్యవస్థ ఆచరణాత్మక సహాయం అందించాలి. అప్పుడే తల్లి తన శిశువుకు తాను పాలు యివ్వడాన్ని ఆత్మవిశ్వాసంతో కొనసాగించగలుగుతుంది.

**మన ప్రశ్నను మార్చుకుందాం**

ఇప్పటి వరకు మనం చేస్తున్నట్టు 'తమ శిశువులకు తల్లులు తాము తల్లిపాలు యిస్తున్నారా?' అనే ప్రశ్న దగ్గర ఆగిపోకూడదు. దాని బదులు 'తల్లులు తల్లిపాలను కొన సాగించేందుకు మనం తగినంత సహాయం చేస్తున్నామా?' అనే ప్రశ్నను మనం వేసుకోవాలి, అడగాలి. ఇదే నిజమైన మార్పుకు ప్రారంభం.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఏపిమాస్ పట్టణ పోషణ పథకంలో నిర్వహించిన కార్యక్రమాలు ఒక విషయాన్ని స్పష్టంగా చూపించాయి. అవగాహనతో పాటు నిరంతర సహాయం, ఆచరణాత్మక మార్గదర్శకత్వం, కుటుంబ మద్దతు మరియు సమాజ భాగస్వామ్యం ఉన్నప్పుడే తల్లిపాల పద్ధతులు స్థిరంగా కొనసాగుతాయి.

తల్లికి చెప్పడం మాత్రమే కాదు...ఆమెను వినాలి.

ఆమెకు నేర్పడం మాత్రమే కాదు...

ఆమెకు తోడుగా నిలవాలి.

ఆమె నిర్ణయాన్ని ప్రశ్నించడం కాదు...

ఆమె నిర్ణయాన్ని కొనసాగించేందుకు అవసరమైన సహాయక వ్యవస్థను నిర్మించాలి.

ప్రతి తల్లికి సమాచారం మాత్రమే కాదు, సహాయం, ప్రోత్సాహం, నమ్మకం అవసరం.

తల్లిపాలను ప్రోత్సహించడం అంటే తల్లిని ఒంటరిగా నిలబెట్టడం కాదు... ఆమె చుట్టూ ఒక బలమైన సహాయక వ్యవస్థను నిర్మించడం. అక్కడి నుంచే నిజమైన మార్పు మొదలవుతుంది.

■

## జాతీయపప్పు ధాన్యాల స్వయం సమృద్ధి పథకం దరఖాస్తులకు ఆహ్వానం

**జా**తీయపప్పు ధాన్యాల స్వయం సమృద్ధి పథకం 2026–27 కింద పప్పు ధాన్యాల పంట ఉత్పత్తుల విలువను పెంచడానికి ప్రాసెసింగ్ యంత్రాల (దాల్ మిల్స్) ఏర్పాటు చేయడానికి ఆసక్తి గల రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పిఓలు), క్లస్టర్ స్థాయి ఫెడరేషన్స్ (సిఎల్ఎఫ్‌లు), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఏసిఎస్), గత రెండు సంవత్సరాలుగా నిర్వహించబడుతూ ప్రాజెక్ట్ వ్యయంలో 15 శాతం భరించగలిగి మరియు ప్రాజెక్ట్ నిర్వహణకు తగిన ఆర్థిక వనరులు కలిగి ఉండాలి.

ఆసక్తి కలిగిన రైతులు కూడా జనగాం, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల్, నారాయణపేట, వికారాబాద్, సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి వారి కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరడమైనది.

రాయితీ ప్రాజెక్టు వ్యయంలో 33 శాతం లేదా 26 లక్షల వరకు ఏది తక్కువైతే అది, పూర్తి వివరాలను వ్యవసాయ శాఖ వెబ్ సైట్ "agri.telangana gov.in" నందు పొందుపరచడమైనది.

**సం/- ఇట్లు డైరక్టర్లు, వ్యవసాయశాఖ, తెలంగాణ**

■

**చేతగాని వారి చేతలతో గొప్ప ఆశయాలు కూడా, బూడిదలో పోసిన పన్నీరవుతాయి**

# సామాజిక బోరుబావితో తాగునీటి సమస్య పరిష్కారం!

– మైత్రి ప్రవీణ్ , రాజోజుల బ్రహ్మాచారి

స్వచ్ఛమైన తాగునీరు ప్రతి కుటుంబానికి అత్యవసర మైన ప్రాథమిక అవసరం. అయితే, నిర్మల్ జిల్లా భైంసా మండలం దేగాం గ్రామంలోని భీమన్న కాలనీలో నివసిస్తున్న 10 కుటుంబాలు చాలా కాలంగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయి. సరైన నీటి వనరు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు ప్రతిరోజూ 200 నుంచి 300 మీటర్ల దూరం వరకు వెళ్లి నీటిని సేకరించాల్సిన పరిస్థితి ఉండేది.

ఈ సమస్యను గుర్తించిన 'గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ' (సెర్ప్), వినాయక గ్రామ సంఘం, గ్రామ పంచాయతీ, వాటర్ ఆర్గ్ సహకారంతో ఏపిమాస్ అమలు చేస్తున్న వాష్ ప్రాజెక్ట్ సంయుక్తంగా చర్యలు చేపట్టాయి.

అందరి సమిష్టి కృషితో భీమన్న కాలనీలో సామాజిక (కమ్యూనిటీ – షేర్డ్) బోరు బావిని ఏర్పాటు చేసి, ప్రారంభించడం ద్వారా 10 కుటుంబాల దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం లభించింది.

**గ్రామపంచాయతీ సహకారం**

ముందుగా , ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే ఉద్దేశంతో 'వినాయక గ్రామ సంఘం' ఆధ్వర్యంలో 10 కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సామాజిక కమిటీ సభ్యులు, గ్రామ సంఘం నాయకత్వం, వాష్ ప్రాజెక్ట్ ప్రతినిధి పాల్గొని కుటుంబాలు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో విఓ అధ్యక్షురాలు శ్రీమతి జి. సునీత, విఓఏ శ్రీ సురేష్ కుమార్, సిసి లావణ్య గారు, ఏపీఎం శ్రీ బైండ్ల రమేష్, వాష్ ప్రాజెక్ట్ అధికారి శ్రీ మైత్రి ప్రవీణ్ పాల్గొని కుటుంబాల అవసరాలను తెలుసుకున్నారు. నీటి సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులు, కుటుంబాలకు అవసరమైన నీటి పరిమాణం, నీటి నిల్వ సౌకర్యం, పైపులైన్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించి కమ్యూనిటీ స్థాయిలో పరిష్కారం అమలు చేయాలని నిర్ణయించారు.

**సమిష్టి ఆర్థిక భాగస్వామ్యం**

సామాజిక బోరు బావిని ఏర్పాటు చేయడంతో పాటు 10 కుటుంబాలకు నీటి నిల్వ, పైపులైన్ సౌకర్యం కల్పించేందుకు వివిధ వనరుల నుంచి ఆర్థిక సహకారం అందించారు. గ్రామ పంచాయతీ ద్వారా బోరు బావి తవ్వకానికి రూ.1,25,000, కరెంట్ స్టార్టర్, ఇతర విద్యుత్ సౌకర్యాల కోసం రూ.11,000, బోరు బావి నీటి వినియోగదారుల వాటాగా రూ. 20,000 సమకూర్చడం జరిగింది. గ్రామ సంఘం ద్వారా 10 కుటుంబాలకు రూ.30,000 వాష్ రుణం మంజూరు చేయడం జరిగింది. వాష్ ప్రాజెక్ట్ ద్వారా రూ.30,000 ఆర్థిక సహకారం అందించడం జరిగింది. ఈ విధంగా గ్రామ పంచాయతీ, కమ్యూనిటీ, గ్రామ సంఘం, వాష్ ప్రాజెక్ట్ సమిష్టి సహకారంతో మొత్తం రూ. 2,16,000 నిధులు సమకూరాయి. ఈ నిధులను కమ్యూనిటీ బోర్‌వెల్ ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, నీటి నిల్వ ట్యాంకులు, పైపులైన్ ఏర్పాటుకు వినియోగించారు.

ఈ సమిష్టి ఆర్థిక భాగస్వామ్యంతో భీమన్న కాలనీలోని 10 కుటుంబాలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టారు.

**ప్రారంభోత్సవం**

కమ్యూనిటీ బోర్‌వెల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని బోరుబావిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కమ్యూనిటీ బోర్‌వెల్ ఏర్పాటు ద్వారా భీమన్న కాలనీలోని 10 కుటుం బాలకు ఇంటి సమీపంలోనే తాగునీటి సౌకర్యం అందుబాటు లోకి రావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. నీటి సమస్య కారణంగా గతంలో

కూలి పనులకు సకాలంలో వెళ్లలేకపోయిన మహిళలు, ఇప్పుడు సమయానికి పనులకు హాజరై ఆదాయం పొందే అవకాశం కూడా మెరుగుపడిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ముందుండి అన్ని పనులను సమన్వయం చేస్తూ, 10 మంది సంఘ సభ్యులను ప్రోత్సహించి, కమ్యూనిటీ బోర్‌వెల్ ఏర్పాటు కోసం నిరంతరం కృషి చేసిన వినాయక గ్రామ సంఘం పదాధికారులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ సంఘం సభ్యుల చొరవ, సమిష్టి కృషి, గ్రామ పంచాయతీ సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి శిలారం సుష్మా రెడ్డి, వార్డ్ మెంబర్ శ్రీ సాయినాథ్, ఏపీఎం శ్రీ బైండ్ల రమేష్, సిసి లావణ్య గారు, వినాయక గ్రామ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి రేఖ, వీఓఏ శ్రీ సురేష్ కుమార్, గ్రామ పెద్దలు , 10 కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

**రీచార్జ్ సిస్టమ్‌కు భూమి పూజ**

సెర్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి కమ్యూనిటీ బోర్‌వెల్ ద్వారా ప్రజలకు నీటి సౌకర్యం కల్పించడంతో పాటు, భవిష్యత్తులో భూగర్భ జలాల స్థాయి తగ్గకుండా రీఛార్జ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని తెలిపారు. బోర్‌వెల్‌కు నిరంతర నీటి లభ్యత ఉండేలా రీచార్జ్ వ్యవస్థను సమగ్రంగా నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ జీ ఎస్ నిధుల ద్వారా రీఛార్జ్ సిస్టమ్ నిర్మాణాన్ని చేపట్టి, వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. దీని ద్వారా కమ్యూనిటీ బోర్‌వెల్‌కు భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా, బోర్‌వెల్ నీటి సామర్థ్యాన్ని కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

అనంతరం శ్రీమతి విజయలక్ష్మి , ఈజీఎస్ శ్రీ లక్ష్మణ రెడ్డి రీఛార్జ్ సిస్టమ్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. రీఛార్జ్ సిస్టమ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత ఈజీఎస్ సిబ్బందికి సూచించారు.

ఈ సందర్భంగా ఏపిమాస్ తెలంగాణ రాష్ట్ర అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మచారి మాట్లాడుతూ, ప్రతి ఇంటికి విడివిడిగా బోర్‌వెల్ ఏర్పాటు చేయడం వల్ల ఒకే ప్రాంతంలో భూగర్భ జలాలపై అధిక ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో, ఒకే నీటి వనరును అనేక కుటుంబాలు సమిష్టిగా వినియోగించు కునే కమ్యూనిటీ లేదా షేర్డ్ బోర్‌వెల్ విధానం నీటి వనరుల సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన వినియోగానికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రతి కుటుంబం కనీసం 500 లీటర్ల నీటిని నిల్వ చేసుకునే సౌకర్యం కలిగి ఉంటే మహిళలకు మరింత సౌకర్య వంతంగా ఉంటుందని, దీనివల్ల రోజువారీ అవసరాలకు అవసరమైన నీరు అందుబాటులో ఉండటంతో మహిళలు తమ ఇంటి పనులను సులభంగా నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. వాష్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ, వినాయక గ్రామసంఘం, సమాజం సమిష్టి సహకారంతో సామాజిక బోరుబావి ఏర్పాటు చేయడం ఒక మంచి నమూనా అని ఆయన పేర్కొన్నారు. వాష్ రుణాల ద్వారా కుటుంబాలు తమ అవసరాలకు అనుగుణంగా ఇంటి వద్ద నీటి సౌకర్యం, నీటి నిల్వ ట్యాంకులు, పైపులైన్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేసుకోవచ్చని, మరుగుదొడ్ల నిర్మాణం, పాత మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టవచ్చని ఆయన వివరించారు.

ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా వాష్ ప్రాజెక్ట్ అధికారిశ్రీ మైత్రి ప్రవీణ్ మాట్లాడుతూ, భీమన్న కాలనీలో కమ్యూనిటీ బోర్‌వెల్ ఏర్పాటు చేయడం ద్వారా 10 కుటుంబాలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు సమర్థ వంతమైన పరిష్కారం లభించిందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు ఇకపై నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకపోవడంతో వారి సమయం, శ్రమ ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ సమయాన్ని కుటుంబ సంరక్షణ, ఇతర ఉత్పాదక పనులు, కూలి పనులకు వినియో గించుకునే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ■

# సెర్ప్ ఎఫ్‌పిఓల ఏపియంలకు సమగ్ర శిక్షణ

– జి. శ్రీనివాస్

రైతుల ఉత్పత్తికి మంచి ధర, వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అనుసంధానం, విలువ జోడింపు వంటి అంశాల్లో సమిష్టి కృషి ఎంతో అవసరం. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు వ్యక్తిగతంగా మార్కెట్‌లో ఎదుర్కొనే అనేక సమస్యలను సమిష్టిగా అధిగమించేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు) ఒక ముఖ్యమైన వేదికగా ఎదుగుతున్నాయి. అయితే ఎఫ్‌పిఓ ఏర్పాటు చేయడం మాత్రమే లక్ష్యం కాదు. అది రైతులకు ఉపయోగపడేలా, మంచి పాలనతో, సరైన నిర్వహణతో, మార్కెట్ ఆధారిత వ్యాపార కార్యకలాపాలతో, పారదర్శక ఆర్థిక వ్యవస్థతో, చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ స్థిరమైన సంస్థగా ఎదగడం అసలు లక్ష్యం.

ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని సెర్ప్ తెలంగాణకు చెందిన అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్స్ (ఏపీఎంలు) కోసం ఏపిమాస్ ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 19, 20 తేదీలలో హైదరాబాద్‌లోని నిమ్స్‌మే లో ఎఫ్‌పిఓ విధానం, పాలన, నిర్వహణ (ఎఫ్‌పిఓ కాన్సెప్ట్, గవర్నెన్స్ అండ్ మేనేజ్‌మెంట్) అనే అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ శిక్షణలో 31 మంది సెర్ప్ ఏపీఎంలు చురుకుగా పాల్గొన్నారు. ఎఫ్‌పిఓల భావన, అవసరం, సంస్థాగత నిర్మాణం, సభ్యత్వం, సభ్యుల యాజమాన్యం, పాలన, నాయకత్వం, నిర్వహణ, చట్టపరమైన నిబంధనలు, ఆగ్రో ప్రాసెసింగ్, పిఎంఎఫ్‌ఎంఇ, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, విలువ జోడింపు, ఆర్థిక లావాదేవీల నిర్వహణ, పుస్తక నిర్వహణ, ఆడిట్, ఎఫ్‌పిఓలకు సంబంధించిన కార్యక్రమాలపై రెండు రోజుల పాటు సమగ్రంగా చర్చించారు.

**శిక్షణకు వినూత్న పరిచయంతో శ్రీకారం:** ఈ కార్యక్రమం సాధారణ శిక్షణల మాదిరిగా కేవలం పేరు, హోదా చెప్పుకోవడంతో ప్రారంభం కాలేదు. పాల్గొన్నవారి పరిచయం, వారి అనుభవాలు, శిక్షణపై ఉన్న అంచనాలు, ఎఫ్‌పిఓలపై వారికి ఉన్న అవగాహనను తెలుసుకునే విధంగా వినూత్నమైన పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ విధానం వల్ల మొదటి నుంచే పాల్గొనే వారిలో పరస్పర పరిచయం పెరగడంతో పాటు, స్వేచ్ఛగా తమ అనుభవాలను పంచుకునే వాతావరణం ఏర్పడింది. ఈ పరిచయ కార్యక్రమాన్ని ఏపీమాస్‌కు చెందిన శ్రీ జి శ్రీనివాస్ సమన్వయం చేశారు. శిక్షణ మొత్తం కూడా పాల్గొనేవారు కేవలం వినేవారిగా కాకుండా తమ అనుభవాలను పంచుకునేలా, ప్రశ్నలు అడిగేలా, సమస్యలను చర్చించేలా, పరిష్కార మార్గాలను ఆలోచించేలా రూపొందించబడింది.

**ఎఫ్‌పిఓ అంటే కేవలం నమోదు చేసిన సంస్థ కాదు:**

మొదటి రోజు శిక్షణలో ఎ ఫ్ పి ఓ ల భావన, వాటి అవసరం, ప్రాధాన్యతపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొంటున్న మార్కెట్ సమస్యలు, వ్యక్తిగతంగా రైతులు పెద్ద మార్కెట్లను చేరుకోవడంలో ఉన్న పరిమితులు, పెట్టుబడుల కొనుగోలులో ఎదురయ్యే సమస్యలు, ఉత్పత్తుల విక్రయంలో మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితుల వంటి అంశాలను చర్చించారు.

ఎఫ్‌పిఓ బలంగా ఉండటానికి కేవలం సభ్యుల సంఖ్య లేదా నమోదు మాత్రమే సరిపోదు. సభ్యుల యాజమాన్యం, మంచి పాలనా, సమర్థవంతమైన నిర్వహణ, పారదర్శక ఆర్థిక వ్యవస్థ, సరైన పుస్తక నిర్వహణ, చట్టపరమైన అనుసరణ, మార్కెట్ అవగాహన మరియు వ్యాపార సాధ్యత అన్నీ కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని శిక్షణలో స్పష్టంగా వివరించారు.

**ఎఫ్‌పిఓల వాస్తవ పరిస్థితులపై రజిత గారి సూచనలు:**

ఈ శిక్షణకు సెర్ప్ సిఓఓ శ్రీమతి రజిత హాజరై, ఎఫ్‌పిఓలలో ప్రస్తుతం జరుగుతున్న కార్యక్రమాలు, క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటిని అధిగమించేం

దుకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు.

ఎఫ్‌పిఓల కార్యకలాపాలు కేవలం సంస్థాగత సమావేశాలు, సభ్యత్వం లేదా రిజిస్ట్రేషన్‌కు మాత్రమే పరిమితం కాకుండా, రైతులకు ఉపయోగపడే సేవలు అందించే స్థాయికి చేరుకోవాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. ఎఫ్‌పిఓలు తమ సభ్యుల అవసరాలను అర్థం చేసుకుని, వారికి అవసరమైన ఇన్‌పుట్‌లు, మార్కెట్ సమాచారం, ఉత్పత్తుల సమీకరణ, మార్కెటింగ్ మరియు ఇతర వ్యాపార అవకాశాలను అందించగలగాలని సూచించారు.

ఎఫ్‌పిఓలలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటికి తగిన పరిష్కారాలను రూపొందించడం, పాలకవర్గం, సిబ్బంది సమన్వయంతో పని చేయడం, సభ్యుల భాగస్వామ్యాన్ని పెంచడం, వ్యాపార కార్యకలాపాలను బలోపేతం చేయడం వంటి చర్యల ద్వారా, సంస్థను దీర్ఘకాలం నిలదొక్కుకునేలా చేయడం ఎంతో ముఖ్యమని ఆమె సూచించారు.

**సభ్యత్వమే యాజమాన్యం :** తదుపరి సెషన్‌లో ఎఫ్‌పిఓల సంస్థాగత నిర్మాణం, సభ్యత్వం, షేర్ కాపిటల్ గురించి వివరించారు. ఎఫ్‌పిఓలో సభ్యులు కేవలం నమోదు చేసుకున్న వ్యక్తులు కాదని, వారు సంస్థకు యజమానులని వివరించారు.

ఈ సెషన్‌లో సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్‌లు, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ శ్రీ రవీందర్ రావు, శ్రీ నవీన్, శ్రీమతి శిరీష, శ్రీ సుధాకర్, శ్రీ మారుతి పాల్గొని సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ అంశాలపై తమ అనుభవాలను పంచుకున్నారు. బి బి ఓ నిధులు డాక్యుమెంట్స్ శిక్షణలు, వివిధ కార్యక్రమాల గురించి అర్థమయ్యేలా వివరించారు.

**మంచి పాలన లేకుండా ఎఫ్‌పిఓ స్థిరపడదు:** ఎఫ్‌పిఓ అభివృద్ధిలో పాలనకు ఉన్న ప్రాధాన్యతను ప్రత్యేకంగా చర్చించారు. బోర్డు ఎలా పని చేయాలి? బోర్డు సమావేశాలు ఎలా నిర్వహించాలి ? వార్షిక సర్వసభ్య సభలో సభ్యుల భాగస్వామ్యం ఎలా ఉండాలి? బోర్డు సభ్యుల బాధ్యతలు ఏమిటి? సంస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఎలా ఉండాలి? వంటి అంశాలను చర్చించారు.

ఈ సెషన్‌లో రోల్ ప్లే మరియు చిన్న గ్రూపు చర్చల ద్వారా వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా చర్చలు జరిగాయి. ఏపీమాస్‌కు చెందిన శ్రీ జి. శ్రీనివాస్ ఈ సెషన్‌ను నిర్వహించారు. ఎఫ్‌పిఓలో బోర్డు మరియు సిబ్బంది తమ తమ బాధ్యతలను స్పష్టంగా అర్థం చేసుకుని పని చేసినప్పుడే సంస్థ సమర్థవంతంగా ముందుకు సాగుతుందని, సభ్యుల భాగస్వామ్యం లేకుండా మంచి పాలన సాధ్యం కాదని శిక్షణలో స్పష్టం చేశారు.

**నిర్వహణలో సిబ్బంది పాత్ర :** మొదటి రోజు మధ్యాహ్నం ఎఫ్‌పిఓ నిర్వహణపై జరిగిన సెషన్‌లో ఎఫ్‌పిఓ సిబ్బంది నిర్వహణ, ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలతో అనుసంధానం, పర్యవేక్షణ, నివేదికలు మరియు ఆడిట్ వంటి అంశాలను చర్చించారు. ఏపిమాస్‌కు చెందిన శ్రీ పి. గంగాధర్ ఈ సెషన్‌ను నిర్వహించారు. రోల్ ప్లే, చార్ట్ ప్రెజెంటేషన్ మరియు ప్రాక్టికల్ డిస్కషన్ ద్వారా ఎఫ్‌పిఓలో స్టాఫ్ పాత్రను వివరించారు. బోర్డు సంస్థకు దిశా నిర్దేశం చేయాల్సి ఉండగా, రోజువారీ కార్యకలాపాలను సిబ్బంది వృత్తిపరంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని వివరిం చారు. మానిటరింగ్, రిపోర్టింగ్, కో–ఆర్డినేషన్ మరియు అకౌంటబిలిటీ లేకుండా ఎఫ్‌పిఓ కార్యకలాపాలను నిరంతరంగా కొనసాగించడం కష్టమని చర్చించారు.

**చట్టపరమైన నిబంధనలు :** ఎఫ్‌పిఓలు నమోదు అయిన తరువాత కూడా అనేక చట్టపరమైన బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్, లైసెన్సులు, పర్మిషన్లు, ఇతర చట్టపరమైన నిబంధనలపై శిక్షణలో అవగాహన కల్పించారు.

**ఉత్పత్తుల ప్రాసెసింగ్ :** మొదటి రోజు చివరి సెషన్‌లో వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, కొనుగోలు, అమ్మకాలు, ఆగ్రో ప్రాసెసింగ్ అవకాశాలపై చర్చించారు. మొక్కజొన్న, కందులు, వేరుశెనగ, జొన్న, వరి వంటి పంటలతో పాటు వెదురు పెంపకం, తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయం, వాన్ ధన్‌వికాస్ కేంద్ర, బయో–ఫోర్టిఫైడ్ క్రాప్స్, నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ మరియు పి ఎం ఎఫ్ ఎం ఇ వంటి కార్యక్రమాలపై సెర్ప్ ప్రధాన కార్యాలయ సిబ్బంది అవగాహన కల్పించారు.

**రెండవ రోజు – మార్కెట్ వైపు అడుగు :**

ఏపిమాస్‌కు చెందిన శ్రీ సతీష్ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, విలువ జోడింపుపై విస్తృతంగా శిక్షణ ఇచ్చారు. ఎఫ్‌పిఓలు ముందుగా ఉత్పత్తిని సేకరించి తరువాత కొనుగోలుదారు కోసం వెతకడం కంటే, ముందుగా మార్కెట్‌ను అర్థం చేసుకుని, కొనుగోలుదారుల అవసరాలను తెలుసుకుని, ఆ తరువాత ఉత్పత్తుల సేకరణ చేయడం మరింత సురక్షితమైన వ్యాపార విధానం అని చర్చించారు.

ఏ ఉత్పత్తి కావాలి? ఎంత పరిమాణం కావాలి? ఏ నాణ్యత కావాలి? ఎంత ధర వస్తుంది? ఎప్పుడు సరఫరా చేయాలి? కొనేవారు ఎవరు? రవాణా ఎలా? నిల్వ సౌకర్యం ఉందా? వర్కింగ్ కాపిటల్ ఎంత అవసరం? వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకున్న తర్వాతే పెద్ద స్థాయిలో వ్యాపార నిర్ణయాలు తీసుకోవాలని వివరించారు.

మార్కెటింగ్‌లో నాణ్యత, పరిమాణం, ధర మాత్రమే కాకుండా సరఫరా స్థితి, అడ్డంకులను ఎదుర్కొనే వ్యూహం, కొనుగోలుదార్లతో సమన్వయం కూడా కీలకమని శిక్షణలో చర్చించారు.

**విలువ జోడింపు ద్వారా మరింత ఆదాయం :**

రైతు ముడి వ్యవసాయ ఉత్పత్తిని విక్రయించడం కంటే, మార్కెట్ డిమాండ్‌ను బట్టి క్లీనింగ్, గ్రేడింగ్, మిల్లింగ్, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్ వంటి కార్యకలాపాల ద్వారా విలువను పెంచవచ్చని వివరించారు.

అయితే వాల్యూ ఎడిషన్ అంటే యంత్రాలు కొనుగోలు చేయడం మాత్రమే కాదని, ముందుగా మార్కెట్ డిమాండ్, ప్రాసెసింగ్ కాస్ట్, ప్రోడక్ట్ క్వాలిటీ, బయ్యర్ రిక్వైర్‌మెంట్స్ మరియు ప్రాఫిటబిలిటీను అంచనా వేయాలని సూచించారు. అంటే "మార్కెట్ ఉన్న వాల్యూ ఎడిషన్‌నే చేపట్టాలి" అనే ముఖ్యమైన సందేశాన్ని శిక్షణ ఇచ్చింది.

**ఆర్థిక లావాదేవీల నిర్వహణ :**

క్యాష్ ట్రాన్సాక్షన్స్, బ్యాంక్ ట్రాన్సాక్షన్స్, రిసీట్స్, పేమెంట్స్, బిల్స్, వోచర్స్, బ్యాంక్ డిపాజిట్స్, విత్‌డ్రాయల్స్, యుపిఐ, నెఫ్ట్, ఆర్టీజీఎస్, బ్యాంక్ రీకన్సిలియేషన్, కాష్ సేఫ్టీ, ఇంటర్నల్ కంట్రోల్స్, బడ్జెట్ – బేస్‌డ్ ఎక్స్‌పెండిచర్, లోన్స్ డిస్ట్రిబ్యూషన్ అండ్ రికవరీ వంటి అంశాలను కేస్ స్టడీస్ మరియు ఎక్సర్‌సైజెస్ ద్వారా వివరించారు. ఎఫ్‌పిఓలో జరిగే ప్రతి ఆర్థిక లావాదేవీకి సరైన డాక్యుమెంటేషన్, ఆథరైజేషన్, వెరిఫికేషన్, అకౌంటింగ్ ఉండాలని వివరించారు. ఆర్థిక వ్యవస్థ పారదర్శకంగా ఉండటం సభ్యుల విశ్వాసానికి కూడా చాలా ముఖ్యమని చర్చించారు.

**ఆడిటర్లతో అవగాహన – పుస్తక నిర్వహణ :**

రెండవ రోజు జరిగిన పుస్తక నిర్వహణ, ఆడిటింగ్ సెషన్ ఈ శిక్షణలో అత్యంత ప్రాయోగికమైన భాగాల్లో ఒకటిగా నిలిచింది. ఎఫ్‌పిఓలకు చట్టబద్ధమైన ఆడిట్ నిర్వహించే ఆడిటర్స్ ఈ సెషన్‌లో పాల్గొని, ఆడిట్ సమయంలో సాధారణంగా ఎదురయ్యే ప్రధాన సమస్యలు, డాక్యుమెంటేషన్‌లో వచ్చే లోపాలు, పుస్తక నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు చట్టబద్ధమైన అంశాల గురించి వివరించారు.

ఎఫ్‌పిఓలలో ఖాతా పుస్తకాలు సక్రమంగా నిర్వహించడం ఎందుకు అవసరం? ఏ పత్రాలు భద్రపరచాలి? బిల్స్, ఓచర్స్ సపోర్టింగ్ డాక్యుమెంట్స్ ఎలా ఉండాలి? యం ఐ ఎస్ ను ఎలా నిర్వహించాలి? ఆడిట్‌కు ముందుగా ఏ విధమైన ప్రిపరేషన్ అవసరం? వంటి అంశాలను ప్రాక్టికల్ ఎగ్జాంపుల్స్‌తో వివరించారు. ఆడిటర్లు ముఖ్యంగా ఒక విషయాన్ని స్పష్టం చేశారు. ఆడిట్ అనేది సంవత్సరాంతంలో మాత్రమే జరిగే కార్యక్రమం కాదు; సంవత్సరం మొత్తం సక్రమంగా పుస్తక నిర్వహణ జరిగినప్పుడే ఆడిట్ సులభంగా మరియు సమర్థవంతంగా పూర్తవుతుంది.

రోజువారీ లావాదేవీలను సమయానికి నమోదు చేయక పోవడం, సపోర్టింగ్ డాక్యుమెంట్స్ సక్రమంగా లేకపోవడం, రీకన్సిలియేషన్‌లో లోపాలు, రికార్డ్స్‌లో గ్యాప్స్ ఉండటం వంటి కారణాలు ఆడిట్ సమయంలో సమస్యలకు దారి తీస్తాయని వివరించారు.

**హంబుల్ బీ కార్యక్రమాలపై అవగాహన :** రెండవ రోజు ఎఫ్‌పిఓ ప్రోగ్రామ్స్‌పై జరిగిన సెషన్‌లో హంబుల్ బీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆ సంస్థ ఆరు జిల్లాల్లో

రైతులతో కలిసి ఎలా పని చేస్తోంది, రైతుల కోసం చేపడు తున్న కార్యక్రమాలు ఏమిటి, రైతులతో అనుసంధానం ఎలా ఏర్పరుచుకుంటోంది, రైతు ఆధారిత అవకాశాలను ఎలా బలోపేతం చేస్తోంది అనే విషయాలను వివరించారు. ఈ ఇంటరాక్షన్ ద్వారా ఎఫ్‌పిఓలు, ఇతర రైతు ఆధారిత సంస్థలు బయటి సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పరచుకుని సాంకేతిక సహాయం, మార్కెట్ అవకాశాలు, లైవ్‌లీహుడ్ సపోర్ట్ మరియు ఇతర సేవలను పొందే అవకాశాలను పాల్గొనేవారు అర్థం చేసుకున్నారు.

ఇలాంటి కాన్వర్జెన్స్ ద్వారా ఎఫ్‌పిఓల పరిధిని విస్తరించవచ్చని, రైతుల అవసరాలకు అనుగుణంగా వివిధ సంస్థల సహకారాన్ని ఉపయోగించుకోవచ్చని చర్చించారు.

**ఏపిమాస్ శిక్షణ బృందం :** ఈ రెండు రోజుల శిక్షణను సమర్థవంతంగా నిర్వహించడంలో ఏపిమాస్ బృందం ముఖ్యమైన పాత్ర పోషించింది. శ్రీ సతీష్, శ్రీ పి.గంగాధర్, శ్రీ జి. శ్రీనివాస్ వివిధ సెషన్లను నిర్వహించడంతో పాటు, మొత్తం కార్యక్రమానికి ఫెసిలిటేషన్స్ సపోర్ట్ అందించారు.

**సెర్ప్ బృందం సహకారం :** ఈ శిక్షణ విజయవంతంగా నిర్వహించడంలో సెర్ప్ రాష్ట్ర కార్యాలయ బృందం అందించిన సహకారం కూడా ఎంతో ముఖ్యమైనది. సీ ఓ ఓ శ్రీమతి రజిత, శ్రీ రవీందర్ రావు, శ్రీమతి శిరీష, శ్రీ సుధాకర్ , శ్రీ నవీన్, శ్రీ మారుతి కార్యక్రమానికి అవసరమైన కో-ఆర్డినేషన్, సపోర్ట్ అందించారు.

**శిక్షణ ఇచ్చిన ప్రధాన సందేశం :** ఈ రెండు రోజుల శిక్షణ నుంచి స్పష్టంగా వచ్చిన సందేశం ఏమిటంటే – ఎఫ్‌పిఓ అంటే కేవలం రైతుల పేర్లను నమోదు చేసి ఏర్పాటు చేసిన సంస్థ కాదు. అది రైతుల యాజమాన్యంలోని ఒకసంస్థ, రైతులకు సేవలు అందించే వేదిక, మార్కెట్‌తో అనుసంధానం చేసే వ్యవస్థ మరియు వ్యాపారపరంగా నిలబడాల్సిన సంస్థ.

ఎఫ్‌పిఓ బలంగా ఉండాలంటే సభ్యుల యాజమాన్యం ఉండాలి. సభ్యుల యాజమాన్యానికి మంచి గవర్నెన్స్ తోడవాలి. గవర్నెన్స్‌కు సమర్థవంతమైన మేనేజ్‌మెంట్ అవసరం. మేనేజ్‌మెంట్‌కు సరైన బిజినెస్ ప్లాన్ అవసరం. బిజిఎనెస్‌కు మార్కెట్, బయ్యర్, క్వాలిటీ, క్వాంటిటీ, సప్లయ్ చైన్ మరియు వర్కింగ్ కాపిటల్ అవసరం. వీటన్నింటికీ పారదర్శకమైన ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్, సరైన బుక్ కీపింగ్ మరియు స్టాట్యూటరీ కాంప్లియెన్స్ పునాదిగా ఉండాలి. అందుకే ఎఫ్‌పిఓ బలోపేతం అనేది ఒక్క అంశంతో సాధ్యమయ్యే ప్రక్రియ కాదు. ఇన్‌స్టిట్యూషన్ బిల్డింగ్ + గవర్నెన్స్ + మేనేజ్‌మెంట్ + బిజినెస్ + మార్కెటింగ్ + ఫైనాన్స్ + కాంప్లియెన్స్ అన్నీ కలిసి పని చేసినప్పుడే ఎఫ్‌పిఓ స్థిరమైన సంస్థగా ఎదుగుతుంది.

చివరగా సెర్ప్ ఏపీఎంలకు నిర్వహించిన ఈ రెండు రోజుల శిక్షణ ఎఫ్‌పిఓలపై వారి అవగాహనను మరింత విస్తరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ఎఫ్‌పిఓలకు అందించాల్సిన హ్యాండ్ హోల్డింగ్‌పై స్పష్టతను కల్పించింది. రైతుల కోసం పని చేస్తున్న ఎఫ్‌పిఓలను బలోపేతం చేయాలంటే వాటి సమస్యలను కేవలం గుర్తించడం కాకుండా, వాటికి సరైన పరిష్కార మార్గాలను చూపించడం, బోర్డును బలోపేతం చేయడం, సభ్యుల భాగస్వామ్యాన్ని పెంచడం, వ్యాపార అవకాశాలను గుర్తించడం, మార్కెట్‌తో అనుసంధానం చేయడం, వర్కింగ్ క్యాపిటల్‌ను ప్రణాళిక చేయడం, పుస్తక నిర్వహణను సక్రమంగా చేయించడం మరియు చట్టపరమైన కాంప్లియెన్స్‌ను నిరంతరం పాటించేలా చేయడం అవసరం.

ఈ శిక్షణ ద్వారా పాల్గొన్న ఏపీఎంలు తమ ప్రాంతాల్లో ఎఫ్‌పిఓలకు మరింత సమర్థవంతమైన సహకారం అందించేందుకు అవసరమైన అవగాహన, ప్రాక్టికల్ ఇన్‌సైట్స్ యాక్షన్ ఓరియెంటేషన్‌ను పొందారు.

రైతు బలపడితే ఎఫ్‌పిఓ బలపడుతుంది; ఎఫ్‌పిఓ బలపడితే రైతు ఆర్థికంగా బలపడతాడు. రైతు యాజమాన్యం, మంచి పాలన, సరైన మార్కెట్, సమర్థవంతమైన నిర్వహణ కలిసినప్పుడే ఎఫ్‌పిఓ ఒక స్థిరమైన, రైతు ప్రయోజనాలను కాపాడే సంస్థగా ఎదుగుతుంది.

మరీ ముఖ్యంగా మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు. ఈ రెండు రోజుల శిక్షణ ఆ దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది. ■

**ఒట్టి ఆలోచనలతో లేదా ఊహలతో ప్రపంచం నడవదు.. గట్టి సంకల్పంతో, నిశ్చయంతోనే అది ముందుకు సాగుతుంది**

# గ్రామీణ మహిళలు బ్యాంక్ రుణాల వినియోగంలో ఏపీ టాప్ !

**బ్యాం**క్ రుణాలను వినియోగించుకుంటున్న గ్రామీణ మహిళలు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే 1వ స్థానంలో నిలిచింది. సుమారు 97 శాతం స్వయంసహాయ సంఘాలు రుణ సదుపాయం పొందాయి.

పీఎంఎఫ్ఎంఈ ద్వారా 35,934 మంది మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాలను సులభతరం చేయడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది.

పొదుపు సంఘాల రుణ ప్రక్రియను డిజిటలైజేషన్ చేయడంలో దేశానికి ఏపీ రోల్ మోడల్‌గా నిలిచింది.

**మహిళలే మహారాణులు!**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో (సెర్ప్) 8,31,439 సంఘాలు, పట్టణ ప్రాంతాల్లో (మెప్మా) 2,74,797 స్వయం సహాయ సంఘాలు ఉన్నాయి. సెర్ప్, మెప్మాల్లో కలిపి 1,80,170 మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారు. బ్యాంక్ క్రెడిట్ లింకేజీ ద్వారా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మార్చాలని లక్ష్యంగా నిర్దేశించారు. పొదుపు సంఘాల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి 'స్వయం-ఏపీ' అనే ప్రత్యేక అంబ్రెల్లా బ్రాండ్ ప్రారంభించారు. 'సీఎం స్వనిధి' కింద పట్టణ వీధి వ్యాపారులకు 267 కోట్ల రూపాయల రుణాలను మెప్మా అందించింది. దేశంలో ఇది రెండో స్థానంలో నిలిచింది.

**తిరిగి చెల్లించని రుణాలు దేశంలోనే అత్యల్పం**

పొదుపు సంఘాల రుణాల డిఫాల్ట్ రేటు కేవలం 0.67 శాతం మాత్రమే. ఇది దేశంలోనే అత్యల్పం. 'పీ4' పథకం కింద 21 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించి పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నారు.

**ఏపీ చేనేత కళకు జాతీయ పురస్కారాలు**

**ఆం**ధ్రప్రదేశ్ చేనేత రంగానికి జాతీయ స్థాయిలో మరోమారు విశేష గౌరవం దక్కింది. రాష్ట్రానికి చెందిన ఇద్దరు నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులు 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక 'జాతీయ చేనేత పురస్కారాలకు' ఎంపికయ్యారు. తిరుపతి, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఈ నేతన్నలు తమ అద్భుత ప్రతిభతో ఈ అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు.

తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన నక్కా వెంకటేశ్వరరావు 'ఉత్తమ మార్కెటింగ్' విభాగంలో జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. వీరి కుటుంబం గత ఆరు

## సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నంబర్ 1

**సై**బర్ నేరాల నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం దేశం లోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) 'ప్రగతి' సమీక్షలో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వ హించిన మూల్యాంకనంలో ఈ విషయం వెల్లడైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని రాష్ట్రాల సైబర్ సెక్యూరిటీ బ్యూరోల పనితీరును తొమ్మిది కీలక పారామితుల ఆధారంగా విశ్లేషించి ఈ ర్యాంకును ఖరారు చేసింది.

స్టేట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎస్4సి) ఏర్పాటు, ఇ-జీరో ఎఫ్ఐఆర్ అమలు, గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మాడ్యూల్ (జి ఆర్ ఎం), బాధితులకు తిరిగి నగదు ఇప్పించేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (యం ఆర్ యం) వినియోగం, సహ్యోగ్-సమన్వయ పోర్టల్ల వాడకం, సైబర్ క్రైమ్ హాట్‌స్పాట్‌ల పర్యవేక్షణ, సామర్థ్య పెంపుదల వంటి కార్యక్రమాల్లో కనబరిచిన అత్యుత్తమ పనితీరు ఆధారంగా తెలంగాణ ఈ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.

దేశంలోనే తొలిసారిగా ఎస్4సి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ పరిధిలోని కేంద్ర వేదికలను అత్యంత సమర్థ వంతంగా వినియోగించుకుంటున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టి జి సి ఎస్ బి) ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. ■

అవకాశాలు అరుదు.. వాటిని గమనించి ఒడిసి పట్టుకోగలిగిన కార్యశీలురు మరీ అరుదు

దశాబ్దాలుగా చేనేత వృత్తినే నమ్ముకుని, వెంకటగిరి వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని ఆర్జించి పెట్టడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

శ్రీకాకుళం జిల్లా ఆలికాం గ్రామానికి చెందిన మురకల నటరాజ్ సైతం ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక అయ్యారు. గత 15 ఏళ్లుగా చేనేత రంగంలో కొనసాగుతున్న ఆయన, తన అద్భుత పనితీరుతో ప్రత్యేక గుర్తింపు పొందారు.

ప్రసిద్ధ పొందూరు కాటన్‌తో అత్యంత నాణ్యమైన జమ్దానీ చీరలను నైపుణ్యంతో రూపొందించడంలో ఆయన సిద్ధహస్తులు. అంతేకాకుండా, సుమారు 50 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ చేనేత రంగంలో ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.

### విలువ జోడింపులో ఏపి మామిడికి మొదటిస్థానం

**జా**తీయ స్థాయిలో పంటలకు విలువ జోడింపులో ఏపీ మామిడి పండ్లు ప్రథమ స్థానం పొందాయి. ముడి పదార్థాల్లోనూ, శుద్ధి చేసి, ప్యాకింగ్ చేయడంలోనూ రాష్ట్రంలో పండిన మామిడి కాయలకు దేశంలో అగ్ర స్థానం లభించింది. 30.67 శాతం మామిడి పండ్లు ఏపీ నుంచే ఉత్పత్తి అవుతున్నాయి.

జాతీయ స్థాయిలో ఆహార శుద్ధిని నిర్ధారించడానికి డెలియిల్ చేసిన అధ్యయనం, పశు సంవర్ధక శాఖ గణాంకాలు, ఎంపెడా నివేదికల ప్రకారం కోడిగుడ్లు, పౌల్ట్రీ ఉత్పత్తుల ముడి వస్తువుల్లో ఏపీ ప్రథమ స్థానంలో నిలిచినా.. శుద్ధి విషయంలో 8 స్థానం దక్కించుకున్నాయి.

రాష్ట్రానికి చెందిన మత్స్య ఉత్పత్తి, సముద్ర రొయ్యలు ముడి పదార్థాల్లో తొలి స్థానంలో ఉన్నా... శుద్ధి విషయంలో సముద్ర రొయ్యలు మూడో స్థానంతో జాతీయ స్థాయిలో 18.98శాతం ఉత్పత్తి అందిస్తుండగా, చేపలు 25.27 శాతం ఉత్పత్తి అందిస్తున్నాయి.

శుద్ధి విషయంలో వరి ధాన్యం(బియ్యం), పాలు, కూరగాయలు, వేరుశనగ రెండో స్థానం, మాంసం నాలుగో స్థానం, చెరకు, జొన్న, మొక్కజొన్న, సజ్జ ఏడో స్థానం, పప్పు ధాన్యాలు తొమ్మిదో స్థానంలో ఉన్నాయి.

### ఔషధ ఉల్లి సాగుతో అధిక ఆదాయం!

**తం**బళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ నాయనప్పగారిపల్లెకు చెందిన అమరనాథరెడ్డి గతంలో టమోటా పంట సాగు చేసి నష్టపోయాడు. తోటి రైతులు సలహా ఇవ్వడంతో తమిళనాడు నుంచి కిలో రూ.13వేలు వెచ్చించి అవతార్ రకం ఔషధ చిన్న ఉల్లిగడ్డల విత్తనాలు తెచ్చి నారు పోశాడు. 40రోజుల తర్వాత నారును ఒకటిన్నర ఎకరం పొలంలో నాటించగా 85 రోజుల తర్వాత పంట దిగుబడి ప్రారంభమైంది. పొలంలో కలుపులేకుండా చూసుకొని నారు ఎదుగుదలకు ఒక్కసారి యూరియా, డీఏపీ వంటి ఎరువులు వేశాడు. భూమి స్వభావాన్ని బట్టి డ్రిప్పుల ద్వారా నీటిని అందించాడు. విత్తనాలు కొనడం దగ్గర నుంచి కూలీలు, పంట దిగుబడి చేతికొచ్చే వరకు ఎకరాకు రూ.80 నుంచి 90వేలు వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతు చెబుతున్నాడు. ఎకరాకు 11 టన్నులకు పైగా దిగుబడి వచ్చినట్టు రైతు అమరనాథరెడ్డి పేర్కొన్నాడు. ఇక్కడి నేల, వాతావరణానికి ఈ రకం ఉల్లిసాగు మంచి దిగుబడితో నికరాదాయం పొందవచ్చునని చెబుతున్నారు.

**శ్రీలంక, మలేషియాకు రవాణా**

అవతార్ రకం ఔషధ ఉల్లిగడ్డలు 2 నుంచి నాలుగు పాయలుగా ఉండి లేతఎరుపు రంగులో ఉంటాయి. కోసేటప్పుడు కొంచెం ఘాటు ఉంటుంది. ఔషధగుణాలు కలిగి ఉండటంతో మందులతోపాటు వంటలకు కూడా వాడవచ్చని రైతు చెబుతున్నాడు. విత్తనాలు ఇచ్చిన వ్యాపారులే తోట దగ్గరకు వచ్చి నాణ్యతను బట్టి కిలోకు రూ.30 నుంచి రూ.35తో పంటను కొనుగోలు చేస్తున్నారు.

**తక్కువ పంట కాలం: నికర ఆదాయం**

ఒకటిన్నర ఎకరంలో ఉల్లి సాగు చేశాను. ఇక్కడి నేల, వాతావరణం అనుకూలించడంతో 11 టన్నులకు పైగా దిగుబడి వచ్చింది. మార్కెటింగ్ ఇబ్బంది లేకుండా వ్యాపారులే తోట వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడి పోను రూ.3లక్షల వరకు ఆదాయం వస్తుందని అనుకుంటున్నా.

**–అమరనాథరెడ్డి, రైతు (ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

సమయం లేదనుకుంటే వుండనే వుండదు.. అనుకుంటే సమయం వుండకపోదు

# ఒక ఎఫ్ పి ఓ ప్రగతి ప్రస్థాన ప్రదర్శన !

**తాడిపత్రి ఎఫ్‌పిఓ ఒక సుస్థిరమైన, లాభదాయకమైన భవిష్యత్తు వైపు అడుగులు వేస్తోంది!**




ప్రతి చెడులోను మంచి వేరుచేసి చూడగలిగే స్వభావం ముందు, కోట్ల సంపద దిగదుడుపే


లాభాల ప్రయాణం:
ఆదాయం నుండి నికర లాభం వరకు
+ అమ్మకాలు
₹1,61,92,808
+ ముగింపు నిల్వ
₹16,23,673
- కొనుగోళ్లు
₹1,66,87,959
= స్థూల లాభం
₹9,15,605
+ ఇతర ఆదాయాలు
₹2,98,937
- నిర్వహణ ఖర్చులు
₹4,54,284
- ఇతర ఖర్చులు
₹1,11,208
= నికర లాభం
₹6,49,049


నగదు ప్రవాహం: మన నిధులు ఎలా పనిచేశాయి?
మొత్తం రాబడులు మరియు చెల్లింపుల సమతుల్యత: ₹1.77 కోట్లు
వ్యాపార అమ్మకాలు
₹1.61 కోట్లు
గత సంవత్సరపు నిల్వ
₹6.56 లక్షలు
రుణాలు & అడ్వాన్స్‌లు
₹6.0 లక్షలు
ఇతర ఆదాయాలు
₹2.98 లక్షలు
వ్యాపార కొనుగోళ్లు
₹1.66 కోట్లు
వ్యాపార నిర్వహణ
₹1.69 లక్షలు
కార్యాలయ ఖర్చులు
₹4.54 లక్షలు
బ్యాంక్ మరియు చేతిలో నగదు
₹3,46,072


కీలక ఆర్థిక నిర్ణయాలు మరియు మద్దతు
వ్యూహాత్మక నిధులు
Rythu Nestham Federation Loan:
₹5,00,017 (మన వ్యాపార విస్తరణకు కీలకం)
Pamidi Mahila FPO Loan: ₹99,995
APMAS & AAPTI SAP Incentives: ₹1,72,220
(మన పనితీరుకు లభించిన గుర్తింపు)
పారదర్శక నిర్వహణ
CEO & Accountant Salary: ₹2,47,992
Office Maintenance & Rent: ₹2,06,292
సమర్థవంతమైన నాయకత్వం మరియు ఆఫీసు
నిర్వహణ ద్వారానే ₹1.61 కోట్ల వ్యాపారం సాధ్యమైంది.


మన సహకార సంఘం అద్భుత వృద్ధి
2024-25 మరియు 2025-26 ఆర్థిక సంవత్సరాల ఆస్తి అప్పుల పోలిక
2024-2025
మొత్తం ఆస్తులు/అప్పులు: ₹14,37,267
83% వృద్ధి
2025-2026
మొత్తం ఆస్తులు/అప్పులు: ₹26,37,823
నిల్వ: ₹16.23 లక్షల విలువైన ఎరువులు మరియు పురుగుమందుల నిల్వ
లాభం: ఈ ఏడాది నికర లాభం (₹6.49 లక్షలు) నేరుగా మన రిజర్వులకు చేరింది
సుస్థిరతకు నిదర్శనం
మార్చి 31, 2026 నాటికి మన ఆస్తి అప్పుల పట్టిక
బాధ్యతలు మరియు మూలధనం
వాటా మూలధనం & గ్రాంట్లు: ₹7,22,000 (మన పునాది)
రిజర్వులు మరియు మిగులు: ₹11,88,551 (గత మరియు ప్రస్తుత లాభాలతో కలిపి)
రుణదాతలు: ₹7,27,088 (Rythu Nestham, Zipsum, Redgram)
రెండూ సమానం: ₹26,37,823
ఆస్తులు మరియు నిల్వలు
ముగింపు సరుకు నిల్వ: ₹16,23,673 (ఎరువులు, పురుగుమందులు)
రావలసిన బాకీలు: ₹6,12,933 (Mango & Redgram వ్యాపారం నుండి)
నగదు నిల్వ: ₹3,46,332
స్థిరాస్తులు: ₹39,683 (Net Book Value)
ఆర్థిక ఆరోగ్య సూచిక
అద్భుతమైన అమ్మకాలు
₹1.61 కోట్ల టర్నోవర్. మామిడి మరియు కొర్రల వ్యాపారంలో భారీ విజయం.
ఖర్చుల నియంత్రణ
సమర్థవంతమైన నిర్వహణ ద్వారా ₹6.49 లక్షల అద్భుతమైన నికర లాభం సాధించాము.
బలమైన బ్యాలెన్స్ షీట్
మన ఆస్తులు దాదాపు రెట్టింపు అయ్యాయి (83% వృద్ధి). సంస్థ యొక్క మూలాలు మరింత బలోపేతం.
సురక్షితమైన నగదు
తదుపరి సీజన్ కు అవసరమైన సరుకు (₹16.2 లక్షలు) మరియు బ్యాంకు బ్యాలెన్స్ (₹3.46 లక్షలు) సిద్ధంగా ఉన్నాయి.
సరుకు

# డ్వాక్రా మహిళలకు తాకట్టు లేకుండా రూ.20 లక్షల రుణం!

స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి ల) బలోపేతం కోసం ఇండియన్ బ్యాంక్ 'ఎస్‌హెచ్‌జీ-శక్తి' అనే అద్భుతమైన పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళా గ్రూపులు తమ సొంత కాళ్లపై నిలబడాలనే లక్ష్యంతో ఈ రుణ సదుపాయం కల్పించారు. ఇప్పటికే బ్యాంకు రుణాలను సక్రమంగా చెల్లిస్తున్న సంఘాలకు ఇది ఒక గొప్ప అవకాశం. మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనుకునే వారికి ఈ పథకం కొండంత అండగా నిలుస్తుంది.

ఇండియన్ బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం.. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే సంఘాలకు ఈ పథకం ప్రాధాన్యత ఇస్తుంది. చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, కోళ్ల ఫారాలు, పశుపోషణ వంటి పనుల కోసం ఈ నిధులను వాడుకోవచ్చు. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల గ్రేడింగ్, సార్టింగ్, ప్యాకేజింగ్ వంటి పనులకు కూడా ఆర్థిక సాయం లభిస్తుంది. పంట రుణాలు, భూమి చదునుచేయడం వంటి పనులను ఈ పథకం పరిధిలోకి తీసుకురాలేదు.

కేవలం వ్యవసాయమే కాకుండా ఎంఎస్‌ఎంఈ పరిధి లోకి వచ్చే తయారీ, సేవా రంగాలు, వ్యాపార కార్యకలాపా లకు కూడా రుణాలు ఇస్తారు. చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పడం, కిరాణా దుకాణాలు లేదా ఇతర సేవా కేంద్రాల ఏర్పాటుకు ఈ నిధులు తోడ్పడతాయి. ఆదాయాన్ని పెంచే ప్రతి చట్టబద్ధమైన వ్యాపారానికి బ్యాంక్ అండగా ఉంటుంది. ఆహార శుద్ధి పరిశ్రమల వంటి వాటికి ఇది ఎంతో మేలు చేస్తుంది.

ఈ 'శక్తి' పథకం కింద 10 లక్షల రూపాయల నుండి 20 లక్షల రూపాయల వరకు భారీ రుణాలను పొందవచ్చు. సాధారణంగా చిన్న రుణాలు ఇచ్చే ఇతర పథకాల కంటే ఇందులో ఎక్కువ మొత్తాన్ని మంజూరు చేస్తారు. దీనివల్ల పెద్ద ఎత్తున వ్యాపారాలు ప్రారంభించడానికి సంఘాలకు వెసులుబాటు కలుగుతుంది. ఆర్థికంగా ఎదగాలనుకునే సంఘాలకు ఈ నిధులు కీలక మలుపుగా మారుతాయి.

ఈ పథకంలో రెండు రకాలుగా రుణాలను మంజూరు చేస్తారు. ఒకటి 'టర్మ్ లోన్'. ఇది నిర్ణీత కాలపరిమితిలో చెల్లించాల్సి ఉంటుంది. రెండవది 'క్యాష్ క్రెడిట్ సదు పాయం. వ్యాపార అవసరాలకు అనుగుణంగా డబ్బును వాడుకోవడానికి, తిరిగి జమ చేయడానికి ఈ క్యాష్ క్రెడిట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఏటా దీనికి సంబంధించిన డ్రాయింగ్ పవర్ నిర్ణయిస్తారు.

చాలా మంది లోన్ తీసుకోవాలంటే తాకట్టు పెట్టడానికి ఏమీ లేదని ఆందోళన చెందుతుంటారు. కానీ ఈ పథకం కింద ఎటువంటి అదనపు పూచీకత్తు, లేదా థర్డ్ పార్టీ గ్యారెంటీ అవసరం లేదు. కేవలం రుణం ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులు మాత్రమే ప్రాథమిక భద్రతగా ఉంటాయి. సిజిఎఫ్ఎంయు పథకం కింద ఈ రుణం కవర్ అవుతుంది, కాబట్టి మహిళా గ్రూపులు ఎటువంటి భయం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు.

టర్మ్ లోన్ తీసుకున్న వారు గరిష్టంగా 60 నెలల (5 ఏళ్ల) లోపు రుణాన్ని తిరిగి చెల్లించాలి. మీరు చేసే వ్యాపారం లేదా పనిని బట్టి ఈ గడువును నిర్ణయిస్తారు. నెలవారీ వాయిదాల పద్ధతిలో సులభంగా అప్పు తీర్చే అవకాశం ఉంటుంది. క్రమం తప్పకుండా చెల్లించే వారికి భవిష్యత్తులో మరిన్ని ఆర్థిక ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది.

వడ్డీ రేట్లు, సర్వీస్ ఛార్జీల వివరాల కోసం ఇండియన్ బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ (www.indianbank.in) సందర్శించవచ్చు. ఎప్పటికప్పుడు మారుతున్న బ్యాంక్ రేట్లకు అనుగుణంగా వడ్డీ ఉంటుంది.

తక్కువ వడ్డీతో ఎక్కువ మొత్తాన్ని పొంది, మహిళా సంఘాలు తమ గ్రామాల్లో ఆర్థిక విప్లవాన్ని తీసుకురావడానికి ఈ పథకం రూపొందింది. ఆసక్తి గల గ్రూపులు తమ సమీపంలోని ఇండియన్ బ్యాంక్ శాఖను సంప్రదించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు.

**'ఎస్ హెచ్ జి గృహలక్ష్మి'**

'ఎస్‌హెచ్‌జీ గృహలక్ష్మి'. స్వయం సహాయక సంఘాల్లోని (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు గృహ రుణాలు అందించే సువిశాల ఉద్దేశంతో ఇండియన్ బ్యాంక్ ఈ ప్రత్యేక పథకానికి రూపకల్పన చేసింది.

ఇండియన్ బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం.. ఈ పథకం ద్వారా రుణం పొందాలంటే దరఖాస్తుదారులు స్వయం సహాయక బృందంలో కనీసం ఏడాది పాటు చురుకైన సభ్యురాలిగా కొనసాగుతూ ఉండాలి. తీసుకున్న అప్పును తిరిగి చెల్లించే సామర్థ్యం కోసం ఆ మహిళ వ్యక్తిగతంగా లేదా బృందంగా ఏదైనా ఉపాధి, వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండటం తప్పనిసరి. ఆసక్తి ఉన్న మహిళా దరఖాస్తుదారుల వయసు 18 నుంచి 60 ఏళ్ల మధ్యలో ఉండాలి.

గృహ రుణం కోసం దరఖాస్తు చేసుకునే మహిళల పేరు మీద లేదా వారి కుటుంబ సభ్యుల పేరు మీద సరైన ఆస్తి పత్రాలు ఉండాలి. రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టా పాస్‌బుక్, అలాట్‌మెంట్ లెటర్, పన్ను చెల్లించిన రశీదులు కచ్చితంగా సమర్పించాలి. ఈ లోన్ నేరుగా వ్యక్తుల పేరు మీద మంజూరు చేసినప్పటికీ, సంబంధిత స్వయం సహాయక బృందం లేదా ఎన్జీవో సిఫార్సు చేయడం అత్యంత కీలకం.

కొత్త ఇల్లు కట్టుకోవడానికి, ఇల్లు కొనుగోలు చేయడానికి ఈ నిధులను వాడుకోవచ్చు. ఇల్లు మాత్రమే కాకుండా జీవనోపాధికి ఉపయోగపడే పశువుల పాక, కిరాణా షాపు, కూరగాయల దుకాణం, గోడౌన్ల నిర్మాణానికి కూడా బ్యాంకు ఆర్థిక సహాయం అందిస్తుంది.

ఇంటి నిర్మాణంలో భాగంగానే ఇంటి స్థలం కొనుగోలు చేయడానికి కూడా లోన్ ఇస్తారు. అయితే సొంత కుటుంబ సభ్యులు, రక్త సంబంధీకుల మధ్య జరిగే ఆస్తుల బదిలీకి ఈ రుణం వర్తించదు.

ఇప్పటికే ఉన్న పాత ఇంటికి అవసరమైన మరమ్మతులు చేసుకోవడానికి ఈ పథకం ఎంతోగానో ఉపయోగపడుతుంది. పెంకుటిల్లు లేదా పూరి గుడిసె స్థానంలో ఆర్సీసీ శ్లాబ్ వేసుకోవచ్చు. ఇంట్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించుకోవడానికి, ఇంటి చుట్టూ ప్రహరీ గోడ కట్టుకోవడానికి బ్యాంకు డబ్బులు ఇస్తుంది. వర్షపు నీటిని నిల్వ చేసే రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాన్ని ఇంట్లో ఏర్పాటు చేసుకోవడానికి సైతం గృహలక్ష్మి పథకం అండగా నిలుస్తుంది

ఈ అద్భుతమైన స్కీమ్ కింద ప్రతి అర్హత గల సభ్యురాలికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు ఇండియన్ బ్యాంక్ రుణం మంజూరు చేస్తుంది. ఇందులో మార్జిన్ నిబంధనను 10 శాతంగా నిర్ణయించారు. అంటే మొత్తం ప్రాజెక్టు ఖర్చులో 10 శాతం నిధులను దరఖాస్తుదారుడు స్వయంగా భరించాల్సి ఉంటుంది. మిగిలిన 90 శాతం మొత్తాన్ని బ్యాంకు రుణంగా అందిస్తుంది. తక్కువ బడ్జెట్‌లో పనులు పూర్తిచేసుకునే వారికి ఇది కచ్చితంగా గొప్ప అవకాశం.

సామాన్యులకు ఆర్థిక భారం కలగకూడదనే సదుద్దేశంతో ఈ రుణాలకు ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజులు బ్యాంకు వసూలు చేయదు. తీసుకున్న లోన్‌ను వాయిదాల పద్ధతిలో సులభంగా తీర్చడానికి గరిష్ఠంగా 15 ఏళ్ల సుదీర్ఘ గడువు లభిస్తుంది. వడ్డీ రేట్లకు సంబంధించిన తాజా వివరాలు, పూర్తి సమాచారం కోసం ఇండియన్ బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ www.indianbank.bank.in హోమ్‌పేజీలోని లెండింగ్ రేట్స్ విభాగాన్ని పరిశీలించవచ్చు. తద్వారా ఖచ్చితమైన వడ్డీ రేటును ముందుగానే తెలుసుకోవచ్చు

ఈ స్కీమ్ కింద కొత్తగా నిర్మించిన, కొనుగోలు చేసిన ఇంటికి లేదా షెడ్డుకు అన్ని రకాల ప్రమాదాల నుంచి రక్షణ కల్పించేలా సమగ్ర బీమా (ఇన్సూరెన్స్) చేయించడం తప్పనిసరి. ఈ బీమాకు అయ్యే ఖర్చును పూర్తిగా రుణగ్రహీత భరించాల్సి ఉంటుంది.

ఎలాంటి ఆకస్మిక ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు జరిగినా నష్టం వాటిల్లకుండా ఈ విధానం కాపాడుతుంది. ఈ పథకంపై మరింత ఆసక్తి, అనుమానాలు ఉంటే దరఖాస్తుదారులు వెంటనే దగ్గర్లోని ఇండియన్ బ్యాంక్ శాఖను సంప్రదించాలి. ■

ఎంతగా వెనక్కు చూడగలిగితే, అంతగా ముందుకూ చూడగలుగుతావు

# ఇంట్లో వాననీటి బ్యాంకు ఉందా?




**ని**త్యం నదుల నీటిపై ఆధారపడే కన్నా.. కురిసే కొద్దిపాటి వాన నీటిని ఒడిసి పడితే చాలావరకు ఇబ్బందులు తప్పుతాయంటున్నారు పర్యావరణవేత్తలు. బోరు, నల్లా, బావుల నీటి కంటే వర్షం నీరు ఎంతో ఉత్తమమైంది. ఇప్పు డిప్పుడే ప్రజలు ఇంకుడు గుంతలు తవ్వి వాన నీటి ప్రవాహాన్ని అందులోకి మళ్లించడంపై దృష్టి సారిస్తున్నారు. కాస్త ముందడుగేసి వాన నీటి ఫిల్టర్లు ఉపయోగించి భవనంపై పడిన నీటిని నేరుగా వడకట్టు కుంటే సులువుగా వాడుకునే వీలుంది.

ఇందుకు మార్కెట్‌లో వివిధ రకాల ఫిల్టర్లు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా వస్త్రంతో వడపోసుకోవచ్చు... కానీ, భవనం పైనుంచి పైపులతో నేరుగా డ్రైన్‌లోకి వెళ్లే నీటిని అలా వడకట్టలేం. అందుకే పైపులకు వాననీటి ఫిల్టర్లను ఏర్పాటు చేసుకొని ఆ నీరు నేరుగా సంపులోకి లేదా ట్యాంకులోకి మళ్లించుకునే అవకాశం ఉంది.

**అందుబాటు ధరలో..**

భవనం పై పడిన వర్షం నీటిని సంపులోకి, ట్యాంకులోకి, ఇంజెక్షన్ బోరు లేదా ఇంకుడు గుంతలోకి పంపే ముందు వాననీటి శుద్ధి పరికరాలు అందులో మలినాలు లేకుండా తొలగిస్తాయి. ఈ పరికరాలకు విద్యుత్తు అవసరమే లేదు. భవన విస్తీర్ణం, నీరు వచ్చే పైపు డయామీటరు ఆధారంగా ఫిల్టర్ ధరలున్నాయి. రూ.4వేల నుంచే మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఆన్‌లైన్‌లో తక్కువ ధరకే ఫిల్టర్లు అందుబాటులో ఉన్నాయి.

**సులువుగా ఏర్పాటు...**

భవనం పైనుంచి వాన నీరు వచ్చే పైపునకు ఫిల్టర్‌ను అమర్చాలి. వర్షం నీరు నేరుగా అందులోకి వెళ్తుంది. ఆకులు, ఇతర చెత్త, దుమ్ము మొత్తం వేరవుతాయి. శుద్ధి నీరు ఓ పక్క, వ్యర్థాలు మరోపక్క నుంచి వస్తాయి. నీటిని ట్యాంకులో పట్టుకుంటే ఇంటి అవసరాలకు వాడొచ్చు. ట్యాంకు నిండితే ఫిల్టర్‌ను బంద్ చేస్తే మళ్లీ యథా విధిగా కిందాకు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకోవచ్చు. కావాల్సిందల్లా ఓ ట్యాంకు, బారెడు పైపులు, అమర్చుకునేందుకు అర్థగంట సమయం మాత్రమే.

**ఉపయోగాలెన్నో..**

- ♦ కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉండవు. అందువల్ల గృహ, పారిశ్రామిక అవసరాలకూ వాడుకోవచ్చు.
- ♦ వాన నీటిని గృహావసరాలకు వినియోగిస్తే డ్రైన్‌పైపులు ఎక్కువ రోజులు మన్నికగా ఉంటాయి.
- ♦ బోరు నీటిలో ఉన్నట్లు ఫ్లోరైడ్ సమస్యే ఉండదు. శుద్ధి కూడా చాలా సులువు.
- ♦ వాన నీటిని ఉపయోగిస్తే బోరు, మున్సిపాలిటీ సరఫరా చేసే నీరు అవసరం ఉండదు. ఫలితంగా విద్యుత్తు, నీటి బిల్లులు తగ్గుతాయి.
- ♦ వినియోగించుకునే తీరును బట్టి శుద్ధి చేసుకుంటే సరిపోతుంది.

**ప్రజల్లో అవగాహన కల్పించాలి**

వర్షం నీరు కాస్త ఫిల్టర్ చేస్తే గృహ అవసరాలకు వాడుకోవచ్చు. ఒక ట్యాంకు, ఫిల్టర్‌తో సులువైన పని ఇది. ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలి. నగరంలో వర్షాకాలంలో 1.7 కి.మీ. ప్రాంతంలో 2.1 కోట్ల లీటర్ల వాన నీరు వృథాగా పోతోంది. ఇందులోని 80శాతం నీటిని ఇళ్ల పైకప్పుల నుంచి సేకరించొచ్చు. అధికారులు దృష్టిపెట్టి ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

**– కల్పన, ది రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు**

(ఈనాడు సౌజన్యంతో)

■

**తన స్థితి మెరుగుపరచుకోవాలనుకోవడం సహజం, అయితే ముందు తనను తాను మెరుగుపరచుకోవడం అంతకంటె అవసరం**

# వరి కొయ్యలను పొలంలో కలియదున్నితే పంటకు మేలు

వరి కోతలు పూర్తి కాగానే మిగిలిన వరి కొయ్యలను కాల్చడం రైతులకు ఆనవాయితీగా మారింది. వాటిని కాల్చడం వల్ల భూసారం దెబ్బతిన్నడమే గాకుండా పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని తెలిసినా కూడా రైతులు అదేపనిగా వరి కొయ్యలను కాలుస్తున్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల గాలికి, ఎండ తీవ్రతకు మంటలు అదుపులోకి రాక అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వరి కొయ్యలను పొలంలో కలియదున్నితే పంటకు మేలు జరుగుతుంది. కానీ కొందరు రైతులు వాటిని మడిలోనే తగులబెట్టి, వచ్చే పంటకు చేజేతులా ఉరి వేసుకుంటున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఎంత మొత్తుకుంటున్నా కొందరు రైతులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

గతంలో కొడవళ్లతో వరిని మొదళ్ల వరకు కోసేవారు. ప్రస్తుతం యంత్రాలు అందుబాటులోకి రావడంతో అవి 25నుంచి 30సెంటీమీటర్ల ఎత్తులో కోస్తున్నాయి. దీంతో మిగిలిన గడ్డి కొయ్యకాళ్ల రూపంలో ఉండిపోతోంది. దీన్ని తొలగించుకునే క్రమంలో రైతులు మడిలోనే తగులబెడుతున్నారు. ఇది పర్యావరణ కాలుష్యానికి దారితీస్తోంది. తాను తీసుకున్న గొయ్యిలో తానే పడ్డట్టుగా, ఈ విధానం వల్ల ప్రకృతి దెబ్బతినడమే కాకుండా అన్నదాత అన్ని విధాలుగా నష్టపోతున్నాడు. భూసారం తగ్గి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపు తోంది. ఒకప్పుడు పశువుల కోసం గడ్డిని ఆదా చేసేవారు. ఇప్పుడు పశువుల సంఖ్య తగ్గడంతో వరిగడ్డి వ్యర్థంగా మారింది. పంటల మధ్య సమయం తక్కువగా ఉండటం, కొయ్యకాళ్లను తగులబెడితే కీటకాలు, వ్యాధికారక జీవులు నశిస్తాయనే అపోహతో చాలామంది రైతులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

**దున్నితేనే బలం..**

వాతావరణ కాలుష్యం పెరిగి, ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. నేలలోనే పోషక విలువలు నశించి పంటకు మేలుచేసే సూక్ష్మజీవులు చనిపోతున్నాయి. దీనివల్ల రైతులు వేసే రసాయన ఎరువులు మొక్కలకు అందే అవకాశం ఉండదు. నేలలోని సేంద్రీయ కర్బనం కార్బన్ డై ఆక్సైడ్‌గా మారి గాలిలో కలుస్తుంది. పొలంలో ఉండే ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు వంటి జీవరాసులు మరణిస్తున్నాయి. వరి పంట కోసిన వెంటనే కొయ్యకాళ్లను తగులబెట్టకుండా పొలంలో మిగిలిన తేమను ఉపయోగించుకొని దున్నాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దున్నడం వల్ల కొయ్యకాళ్లు మట్టితో కప్పబడి కుళ్లే ప్రక్రియ ప్రారంభం అవుతుంది. తద్వారా సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఇలా చేయడం వల్ల వేసవిలో నేలలో పగుళ్లు రాకపోవడం, తేమ ఆవిరి కావడం తగ్గి తొలకరిలో పడిన వర్షపు నీరు నేలలోకి ఇంకిపోవడం ద్వారా నేల కోతకు గురి కాకుండా ఉంటుంది.

టన్ను వరిగడ్డి కావాలంటే ఆ వరి పెరుగుదలకు 19.9 కిలోల పొటాషియం, 6.2 కిలోల నత్రజని, 1.1కిలోల భాస్వరంతో పాటు కొంత మోతాదులో సూక్ష్మ పోషకాలు అవసరమవుతాయి. కొచ్చకాళ్లను కలియదున్నితే గడ్డి ద్వారా పోషకాలన్నీ తిరిగి నేలకు చేరుతాయి. లేదా ఈ పంట అవశేషాల వ్యర్థాలను కంపోస్టు చేయడం ద్వారా సేంద్రియ ఎరువుగా తయారు చేసుకోవచ్చు. వానాకాలంలో దమ్ము చేసేటప్పుడు ఎకరానికి 50కిలోల సూపర్ పాస్పేట్ వేస్తే నేలలో మిగిలిపోయిన వరికొయ్యలు తొందరగా కుళ్లిపోతాయి. తర్వాత నాటే వరిపంటకు నేల ద్వారా పోషకాలు అందుబాటులోకి వస్తాయి. ఈ విధానంపై ఆయా మండలాల్లో వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం..**

వరికొయ్యలను తగులబెట్టకుండా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వానాకాలం పం టల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో రైతు వేదికల్లో అవగాహన చేపడుతున్నాం. ఈ విషయంలో ఏఈవోలను అప్రమత్తం చేస్తున్నాం. వరికొయ్యలను తగులబెట్టడం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరిస్తున్నాం. రైతులు ఆచరణలో మార్పు తెచ్చుకోవాలి.

**– నాగరాజు, వ్యవసాయ అధికారి, బెజ్జూరు**

■

**ఈ తరాలకి చాలా గొప్పదనిపించే విషయం, తరువాతి తరానికి పనికిమాలినదని అనిపించవచ్చు**

# మహిళల భద్రత సమాజ బాధ్యత కూడా ... !

**శా**స్త్ర, సాంకేతిక రంగాల్లో మానవాళి ప్రగతి సాధించినా... మహిళలపట్ల పురుషుల దృష్టికోణంలో వచ్చిన మార్పు అంతంత మాత్రమే. అందుకు జాతీయ నేరగణాంకాల పట్టికలోని అంకెలే నిదర్శనం. మహిళాభి వృద్ధికి ప్రధాన అవరోధంగా మారిన వేధింపుల పర్వానికి ఫుల్‌స్టాప్ పెట్టాలన్న సంకల్పంతో తెలంగాణ మహిళా భద్రతా విభాగం డీజీపీ చారుసిన్హా.. 'స్టాండ్ విత్ హర్' క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతికి చెందిన 'నవ్య'తో మాట్లాడారు. ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ఆ వివరాలు మీ కోసం ...

"మహిళల భద్రత కేవలం పోలీసుల కర్తవ్యమే కాదు... సమాజానికి కూడా అంతకుమించిన బాధ్యత ఉంది. ఇల్లు, పని ప్రదేశం, వీధులు, సామాజిక మాధ్యమాలు, బస్సులు, రైళ్లు... అంతటా మహిళల పట్ల అమర్యాద, అవమానాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. కొందరు మగవాళ్లు వంకర చూపులతో ఇబ్బంది పెడితే, ఇంకొందరు మాటలతో వేధిస్తారు. మరికొందరు చేష్టలతో హింసిస్తారు. ఇంటర్నెట్ వాడకం పెరిగిన తర్వాత మహిళలపై వేధింపులు రకరకాలు గా కొత్త రూపాలు తీసుకున్నాయి. ఒకడు తను లైంగికదాడికి ఎలా ఒడిగడతాడో కళ్లకు కట్టినట్టుగా వివరించి, బెదిరిస్తూ తీసిన వీడియోను ఒక అమ్మాయికి పంపించాడు. అది విన్న నా మనసు కకావికలమైంది. 'అబ్బాయిల మానసికస్థితి ఇంత దారుణంగా తయారయిందా?' అని నిర్ఘాంతపోయాను.

లింగవివక్ష పూర్వక వ్యాఖ్యలు, ఈవ్‌టీజింగ్, ఆన్‌లైన్ వేధింపుల సంగతి అయితే చెప్పనవసరం లేదు. ఇవన్నీ సర్వసాధారణమన్నంతగా సమాజంలోనూ అభిప్రాయం స్థిరపడిపోయింది. మాటలతో వేధించేవాడిని ఇవాళ నిలువ రించకపోతే రేపు వాడే యాసిడ్ బాటిల్ పట్టుకొని తిరుగు తాడు. కనిపించిన ప్రతి అమ్మాయి పట్ల వికారంగా ప్రవర్తి స్తాడు. మరి పురుషుల్లోని ఈ మితిమీరినతనాన్ని అడ్డుకునే దెవరు? దాన్ని మొగ్గలోనే తుంచేదెవ్వరు?ఆ బాధ్యత కూడా బాధితురాలిమీదే నెడదామా? కాదు...ఆమెకు తోడుగా నిలవాల్సింది మనమే! బాధితురాలి పక్షాన వకాల్తా పుచ్చుకొని, ఆకతాయిలకు తగిన బుద్ధి చెప్పాల్సిన కనీస బాధ్యత పురుషులదే! మగాళ్లు! మౌనం వీడండి. మహిళలపై వేధింపుల పర్వాన్ని అడ్డుకోండి. ఇదే పిలుపుతో 'స్టాండ్ విత్ హర్' క్యాంపెయిన్ మొదలుపెట్టాం.

**విశ్వవిద్యాలయాల్లోకి...**

ఏడాది పాటు కొనసాగే 'స్టాండ్ విత్ హర్' క్యాంపెయిన్ లో నెలకొక ప్రత్యేక థీమ్‌ను ఎంపిక చేసుకొని ప్రచారం నిర్వహిస్తున్నాం. సెక్సిస్ట్ జోక్స్, ఈవ్‌టీజింగ్ లాంటి వేధిం పుల సంస్కృతిని చట్టాలు,శిక్షలకన్నా పురుషుల దృక్పథాన్ని మార్చడంద్వారానే నిర్మూలించగలం. దానికోసం అవగాహన కల్పించే వీడియోలు, లఘుచిత్రాలు రూపొందిస్తున్నాం. వివిధ రంగాల వారితో చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నాం. తెలంగాణ లోని అన్ని విశ్వవిద్యాలయాలకూ ఈ క్యాంపెయిన్‌ను తీసుకువెళ్లడానికి అనుగుణమైన ప్రణాళికలు తయారు చేశాం. కొందరు ప్రొఫెసర్లతో కమిటీలు ఏర్పాటుచేసి... రకరకాల అంశాలపై ప్యానల్ డిస్కషన్స్ పెడతాం. వీడియో లనూ ప్రదర్శిస్తాం. ఆ క్రమంలో ఏది సరైన ప్రవర్తన? ఏది కాదన్న విషయాన్ని అర్థంచేసుకొనే అవకాశాన్ని అబ్బాయిలకే వదిలేస్తాం. తద్వారా వాళ్లలో జెండర్ సెన్సిటివిటీని పెంపొందించాలన్నది మా ఉద్దేశం. ఉదాహరణకు తమకు నచ్చిన దుస్తులు ధరించే అబ్బాయిలు .... అమ్మాయిల వస్త్రధారణ మీద వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సరైనది? నచ్చిన దుస్తులు ధరించే స్వేచ్ఛ అమ్మాయిలకు లేదా? అసలు మహిళలు, యువతులు ఎలా నడుచుకోవాలి? ఎలాంటి దుస్తులు ధరించాలి? లాంటి విషయాల్లో తీర్పులు ఇచ్చే అధికారం ఎవరిచ్చారు? ఇటువంటి సున్నితమైన అంశాలపై సునిశితమైన చర్చను ఈ క్యాంపెయిన్ ద్వారా పురుషుల ముందు ఉంచుతున్నాం.

**కార్పొరేట్‌లో కష్టాలు...**

పురుషులు గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే... ఒక యువతి లేదా మహిళ మీతో కలిసి కాఫీ తాగడానికి

ఏ విషయంలోనూ ఒక నిర్ణయం తీసుకోలేకపోవడానికి మించిన దౌర్భాగ్యం జీవితంలో మరొకటి లేదు

వచ్చినంత మాత్రాన, లేదా మీతో స్నేహపూర్వకంగా మెలిగినంత మాత్రాన ఆమె మిమ్మల్ని ప్రేమిస్తున్నట్టు కాదు. దురదృష్టవశాత్తూ అమ్మాయిలపట్ల అబ్బాయిలు సత్ప్రవర్తనతో మెలిగే పద్ధతులను మన పాఠశాలలు, విద్యాలయాలు, కుటుంబం,సమాజం ఇవేవీ నేర్పించలేకపోతున్నాయి. వారిని సినిమాలు బాగా ప్రభావితం చేస్తున్నాయి. సున్నితత్వాన్ని పెంపొందించే సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, సాహిత్యం విరివిగా రావాలి. అందుకే సినీరంగ ప్రముఖులను కూడా ఈ క్యాంపెయిన్ లో భాగస్వామ్యం చేస్తున్నాం. కార్పొరేట్ కంపెనీల్లో మగ టీమ్‌లీడర్లు, మేనేజర్ల వేధింపులు తట్టుకోలేక ఉద్యోగాలు వదిలేస్తున్న ఉద్యోగినులు ఎంతోమంది.

ఒకవేళ ఫిర్యాదుచేస్తే మరొక ఆఫీసులో ఉద్యోగం దొరకదన్న భయం చాలామంది మహిళలది. లేదంటే…ఆమె మీద ప్రాబ్లమేటిక్ అనో లేదా పని సరిగ్గా చేయరనో రకరకాల ముద్రలువేసి దుష్ప్రచారం చేస్తుంటారు. హైదరాబాద్‌లోని చాలా కార్పొరేట్ కంపెనీల్లో ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీలు లేవు. ఆఫీసులో ఎవరైనా ఒక తెంపరి ఉద్యోగినుల మీద ప్రత్యక్షంగా లేదా పరోక్షంగానైనా సెక్సిస్ట్‌జోక్స్ వేయడం, పలుచనచేసి మాట్లాడడం లాంటివి చేసినప్పుడు నిర్మొహమాటంగా 'అది సరికాదు' అని చెప్పాల్సింది పురుషులే! .

**అలాంటి వారిని వదిలేది లేదు**

ఆన్‌లైన్‌లో మహిళలపై వేధింపులు ఈ మధ్యకాలంలో పెరిగాయి. ఏదైనా సామాజిక అంశంపై మహిళలు అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన సందర్భంలో అవి మరింత మీరుతున్నాయి. బూతులు తిట్టడం సర్వ సాధారణమైంది. ఇలాగే తమ అభిప్రాయాలను చెబుతూ వీడియోలు షేర్ చేసిన ఇద్దరు మహిళా జర్నలిస్టులను సోషల్ మీడియాలో కొందరు పోకిరీలు వేధించిన ఘటనలు మా దృష్టికి వచ్చాయి. కేవలం బూతులతో దాడిచేయడమే కాదు, వారి ఫొటోలు మార్ఫ్ చేసి మరీ షేర్ చేయడం లాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడ్డారు. అలాంటి వారిని గుర్తించి తగిన శిక్షపడేలా చేశాం. బూతులు, తిట్లతో వేధిస్తామంటే పోలీసులు ఓ కంట కనిపెడుతున్నారన్న సంగతి ఆన్‌లైన్ పోకిరీలు గుర్తుంచుకోవాలి.

**దయచేసి స్పందించండి!**

కొన్నాళ్ల కిందట రాజస్థాన్‌లో నేను గమనించిన ఒక ఘటన గురించి కచ్చితంగా చెప్పాలి. అక్కడ ఒక పెద్ద హోటల్‌లోని స్విమ్మింగ్‌పూల్‌లో కొందరు అమ్మాయిలు ఈత కొడుతున్నారు. ఆ ఈతకొలను చుట్టూ మగ వెయిటర్లంతా నిలబడి సినిమాలా చూస్తున్నారు. హోటల్ యాజమాన్యం, ఆ అమ్మాయిలు, చుట్టుపక్కల వ్యక్తుల్లో ఒక్కరు కూడా కనీసం ఆ వెయిటర్లను అదిలించిన పాపాన పోలేదు. ప్రతిచోటా ఇలాంటి అపసవ్య ధోరణులే. వాటన్నింటినీ చూస్తూ ఊరుకోవడమేనా! నోరు మెదపాలి కదా! 'ఇది తప్పు' అని చెప్పాలి కదా! అమ్మాయిల తీరు కూడా మారాలి. బస్టాప్‌లో ఆకతాయిలు వేధిస్తుంటే మరొక బస్సు రూట్‌కు వెళ్లడం, జీన్స్ ధరించావని కాలేజీలో ఎవడో కామెంట్ చేస్తే, ఇష్టమైన ఆ డ్రెస్‌కు బదులు సల్వార్ కమీజ్‌లోకి మారడం, వీధిలో వెళ్లేప్పుడు ఈవ్‌టీజింగ్ ఎదురైతే, మౌనంగా తలవంచుకొని వెళ్లడంకాదు… పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అలాంటి విపత్కాలంలో పురుషులు మహిళలకు తోడుగా నిలవాలి."

**సాంత్వన్ … జెండర్ కన్వర్జేషన్స్‌తో మార్పు…**

నేను సీఆర్పీఎఫ్ కశ్మీరు సెక్టార్‌కు ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ)గా పనిచేస్తున్న సమయంలో 28 వేల మంది పురుషులతో 'జెండర్ కన్వర్జేషన్స్' కార్యక్రమం నిర్వహించాం. ఇంటికి దూరంగా ఉంటూ విధులు నిర్వర్తించే వారందరిలో ఆ ప్రోగ్రామ్ ద్వారా అనూహ్యమైన మార్పులు తీసుకురాగలిగాం. అది వారి వ్యక్తిగత, కుటుంబ జీవితాల మీదా సానుకూల ప్రభావం చూపింది. డిగ్రీ చదువుతున్న తన కుమార్తెకు వెంటనే పెళ్లి చేయాలనుకున్న ఓ తండ్రితో మేము మాట్లాడిన తర్వాత… అమ్మాయి చదువుకొని, మంచి ఉద్యోగంలో చేరిన తర్వాతే, అదీ ఆమె ఇష్టప్రకారం సంబంధాలు చూడాలని నిశ్చయించుకున్నాడు. వెయ్యి మందికి పైగా సీఆర్పీఎఫ్ సిబ్బంది సెలవులకు ఇంటికి వెళ్లినప్పుడు తమ భార్యలకు స్కూటర్ నేర్పించారు. చర్చలు, సంభాషణల ద్వారా దృక్పథాన్ని మార్చవచ్చనడానికి ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ. 'స్టాండ్‌విత్ హర్' క్యాంపెయిన్ ద్వారా ఇలాంటి సానుకూల ఫలితాలు కచ్చితంగా వస్తాయి. ■

**తనను తాను పట్టించుకోకపోతే మరెవరు పట్టించుకుంటారు? తనకే తాను పరిమితమైతే ఆ బతుకుకు అర్థమేమిటి?**

# పది జిల్లాల రైతుల పంట పండించనున్న ఉద్యాన హబ్!

**రా**యలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు ప్రయోజనం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఉద్యానహబ్‌కు కేంద్రం పచ్చజెండా ఊపింది. 300 కోట్ల అమెరికన్ డాలర్ల రుణం (దాదాపు రూ. 28,500 కోట్లు) ప్రపంచబ్యాంకు నుంచి పొందేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖ ఆమోదం తెలిపింది.

ఈ రుణం 75:25 నిష్పత్తిలో తిరిగి తీర్చేందుకు కూడా ఆమోదం దక్కింది. అంటే ఇందులో 25% రుణ వాటా కేంద్ర ప్రభుత్వమే భరించ బోతోంది. మిగిలినది రాష్ట్రం భరిస్తుంది. రూ. లక్ష కోట్ల ఉద్యాన హబ్ ప్రణాళిక లో మరో రూ. 10 వేల కోట్లు కూడా కేంద్రమే ఇచ్చేం దుకు సంసిద్ధత వ్యక్తం చేసిందని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.



దీనికితోడు రూ. 60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులూ సమీకరిస్తారు. ప్రైవేటు పెట్టుబడులను ఉద్యాన ఉత్పత్తుల నిల్వలకు అవసరమైన శీతల గిడ్డంగులు తదితర నిర్మాణాలకు ఉపయోగిస్తారు. మూడేళ్ల కాలంలో 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లలో ఈ పథకం అమలు చేస్తారు. ఇప్పటికే ప్రపంచ బ్యాంకు బృందాలు రెండుసార్లు రాష్ట్రంలో పర్యటించి వెళ్లాయి. ఈ ఉద్యాన హబ్ కింద సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల అభివృద్ధి, ఉద్యానాల అభివృద్ధి తదితర అంశాలను ఎలా చేపట్టేదీ ఆ బృందాలకు అధికారులు వివరించారు. ఇప్పటికే ప్రపంచబ్యాంకు అంతర్గత కమిటీ పరిశీలనకు ఈ రుణ ప్రతిపాదన వెళ్లింది. అక్టోబరు నాటికి రుణం మంజూరవుతుంది.

**మూడేళ్లలో మూడు దశల్లో..**

ఈ ప్రాజెక్టును 10 జిల్లాల్లో మూడేళ్లలో అమలు చేయబోతున్నారు. తొలి ఏడాది రూ. 12,066 కోట్లు, రెండో ఏడాది రూ. 15,036 కోట్లు, మూడో ఏడాది రూ. 13,250 కోట్లు ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఉద్యాన ఉత్పత్తుల్లో తొలి స్థానంలో ఉంది. దేశంలో ఎక్కడా ఇంత పెద్ద ఎత్తున ఉద్యాన విస్తరణ పథకం చేపట్టలేదని ఆర్థికశాఖ అధికారులు పేర్కొన్నారు. ఇది రాష్ట్ర ఉద్యాన, నీటి పారుదల స్వరూపాన్ని మారుస్తుందని అంటున్నారు.

ఉద్యాన హబ్‌లో భాగంగా నీటి పారుదల శాఖకు ప్రధాన ప్రాజెక్టులు, చెక్ డ్యాంలు, చెరువుల పునరుద్ధరణ వంటి పనుల నిర్వహణ కోసం రూ. 20,884 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 22 భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేస్తారు. 21 చెక్ డ్యాంలు, 101 చిన్ననీటి చెరువులను పునరుద్ధరిస్తారు. ఫలితంగా కరవు ప్రాంతాల్లో 9 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లు అందుతాయి. 4.36 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది. గ్రామీణ రహదారుల నిర్మాణానికి, ఉద్యాన ఉత్పత్తుల సులభతర రవాణాకు రూ. 4,562 కోట్లు ఖర్చు చేయబోతున్నారు.

ఉద్యాన శాఖ కింద రూ. 14,906 కోట్లు ఖర్చు చేస్తారు. తొలి ఏడాది 72, రెండో ఏడాది 67, మూడో ఏడాది 62 క్లస్టర్‌లలో పనులు చేస్తారు. ■

రేపటి గెలుపుకోసం నేటి ఓటమి మేలు

# అన్నదాతకు వరం.. పి ఎం కిసాన్ మాన్‌ధన్!

**కేం**ద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం రైతులకు వరంగా మారనుంది. రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని తీసుకువచ్చింది. వృద్ధాప్యంలోకి వచ్చాక చాలామంది రైతులకు ఎలాంటి ఆదాయ వనరులు ఉండవు.

ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఈ పథకం కింద 60 ఏళ్లు నిండాక రైతులకు ప్రతీనెల రూ.3వేల చొప్పున పింఛన్ జీవితకాలం అందుతుంది. 18 నుంచి 40 ఏళ్ల మధ్యవయస్సు ఉన్నరైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. భూరికార్డుల్లో తమపేరు ఉండి రెండు హెక్టార్లవరకు సాగు చేసేందుకు వీలుగా భూమి ఉన్నవారు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసు కోవచ్చు. నమోదు ఎప్పుడైనా 60 ఏళ్లు దాటాకే పెన్షన్ వస్తుంది.

నేషనల్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్నవారు, ఏదైనా ఇతర చట్టబద్ధ సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్నవారు, ఉన్నత ఆర్థికస్థితి కలిగినవారు, టాక్స్ పరిధిలో ఉన్నవారు, టాక్స్‌పేయర్లు ఈ పథకానికి అర్హులు కారు. ఈ పెన్షన్ అందేవరకు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పథకంలో చేరేవారి వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది. రైతు చెల్లించినంతే ప్రభుత్వం కూడా తన వంతుగా బీమా కంపెనీకి నగదు జమ చేస్తుంది.

**ప్రీమియం వివరాలు..**

18 నుంచి 40 ఏళ్ల వయస్సులోపు రైతులు ఈ పథకానికి అర్హులు. ప్రతి నెలా రూ.55 నుంచి రూ. 200 వరకు ప్రీమియంను బ్యాంక్ ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. రైతు చెల్లించిన ప్రీమియం మొత్తానికి కేంద్ర ప్రభుత్వం సమానంగా చెల్లిస్తుంది. రైతు రూ.55 జమ చేస్తే ప్రతీ నెల రూ.110 జమ అవుతుంది. 20 నుంచి 25 ఏళ్ల వయస్సు గల రైతులు రూ.61 ప్రీమియం, 30 ఏళ్ల వారికి రూ.105, 35 ఏళ్ల వారికి రూ.150, 40 ఏళ్ల వారికి రూ.200 ఉంటుంది. రైతు మరణిస్తే భార్య ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. 60 ఏళ్ల తర్వాత రైతు మరణిస్తే భార్యకు రూ.1500 పెన్షన్ వస్తుంది. రైతు ఫొటో, నివాస, ధ్రువీకరణ పత్రం, సాగుభూమి, ఆదాయం వంటి వివరాలు, పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

**దరఖాస్తు చేసుకోవడం ఇలా..**

పీఎం కిసాన్ మాన్‌ధన్ లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎంసీ) పీఎం కిసాన్ సీఎం కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రైతు మొదట తన ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి. పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులను చెల్లించాలి. ప్రతీనెల ఆటోమెటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి పథకానికి జమ అవుతాయి. నామినీ వివరాలను నమోదు చేయాలి.

మాన్‌ధన్ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని రైతు సంతకం చేసి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలి. వెంటనే మీకు పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కార్డు జనరేట్ అవుతుంది. ప్రతీ నెల బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు పీఎంకేఎంవై పథకానికి ఆటోమెటిక్‌గా జమ అవుతాయి. పీఎం కిసాన్ మాన్‌ధన్ లబ్ధిదారులు కావాలనుకుంటే సీఎస్‌సీలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకొని ఫింఛన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రీమియం డబ్బులను నగదు రూపంలో చెల్లించాలి. ఆ తరువాత బ్యాంక్ ఖాతాను జత చేసుకోవాలి

**ప్రీమియం చెల్లింపు ఇలా...**

| **వయస్సు** | **చెల్లించాల్సింది రూ.** |
|---|---|
| 18 నుంచి 20 | 55 |
| 21 నుంచి 24 | 61 |
| 25 నుంచి 29 | 80 |
| 30 నుంచి 34 | 106 |
| 35 నుంచి 39 | 150 |
| 40 – | 200. |

■

# ఒకే పొలంలో వరి, చేపలు, కొబ్బరి.. ఫిష్ పాడీ మోడల్!

**పి**ల్లలు విదేశాల్లో మంచి చదువులు చదివి స్థిరపడినా ఆయన మాత్రం మట్టిని నమ్ముకున్నారు. ఏపీసీఎన్‌ఎఫ్‌లో జోనల్ కోఆర్డినేటర్‌గా అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తూనే ప్రకృతి వ్యవసాయంలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఆయన పేరే వెంకటరత్నం. ఏలూరు జిల్లాకు చెందిన 54 ఏళ్ల ఈయన వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ ఏటా రూ.15 లక్షల వరకు ఆదాయం గడిస్తున్నారు. ఒక బిడ్డ లండన్‌లో ఎంబీఏ చేసి హైదరాబాద్‌లో స్థిరపడగా, మరో బిడ్డ జర్మనీలో మెడిసిన్ చదువుతున్నారు. అయినా ఆయన వ్యవసాయంపై మక్కువతో సాగు చేస్తున్న వినూత్న 'ఫిష్ పాడీ మోడల్' ఏకంగా 11 దేశాల ప్రతినిధులను ఆకర్షించింది.

ఈ వినూత్న వ్యవసాయ పద్ధతుల గురించి వెంకటరత్నం పలు అంశాలను వెల్లడించారు. తనకున్న మొత్తం 9.5 ఎకరాల భూమిలో 1.5 ఎకరాన్ని ప్రత్యేకంగా ఈ 'ఫిష్ పాడీ మోడల్' కోసం కేటాయించారు. ఈ విధానంలో స్థలాన్ని మూడు భాగాలుగా విభజించి అత్యద్భుతమైన ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ చేస్తున్నారు. ఇందులో 70 సెంట్ల భూమిలో వరి సాగు చేస్తుండగా, దానిచుట్టూ 40 సెంట్లలో చేపల చెరువును ఏర్పాటు చేశారు. ఆ చెరువు గట్లపై ఉన్న మరో 40 సెంట్ల స్థలంలో కొబ్బరి, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, అరటి, జామ వంటి పలురకాల మొక్కలు పెంచుతూ ప్రతి అంగుళాన్ని లాభదాయకంగా మార్చుకున్నారు.

మిగతా 8 ఎకరాల్లో పూర్తిగా దేశవాళీ వరి రకాలను సాగు చేస్తున్నారు. కుజిపటాలియా, రక్తశాలి, మైసూర్ మల్లిక, నబారా, ఇంద్రాణీ, తులసీ బసు లాంటి స్వదేశీ రకాలకు ఆయన ప్రాణం పోస్తున్నారు. ఈ వరి నాట్లు వేయడానికి ముందు పొలంలో పచ్చిరొట్ట ఎరువులైన చిరుధాన్యాలు, నూనె గింజలను చల్లుతారు. సరిగ్గా 70 రోజుల తర్వాత వాటిని పొలంలోనే కలియదున్ని భూసారాన్ని పెంచుతారు. ఆ తర్వాతే వరి నాట్లు వేస్తూ మంచి దిగుబడి సాధిస్తున్నారు.

సాగులో ఎక్కడా రసాయనాలు వాడకుండా పూర్తిగా ప్రకృతి సిద్ధమైన పద్ధతులను ఆయన పాటిస్తున్నారు. తనకున్న 6 ఆవుల నుంచి సేకరించిన పేడ, మూత్రంతో ఘన, ద్రవ జీవామృతం తయారు చేసి పంటలకు అందిస్తారు. ఆకులతో వివిధ రకాల కషాయాలు తయారు చేసేందుకు వెయ్యి లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకును నిర్మించారు. పంట ప్రారంభ దశలో వీటిని వినియోగిస్తూ, కోడిగుడ్డు, నిమ్మరసం కలిపిన ద్రావణాన్ని గ్రోత్ ప్రమోటర్‌గా వాడుతారు. ఎకరానికి కేవలం పావు లీటరు ద్రావణం వాడి ఆశించిన ఫలితాలు రాబడుతున్నారు.

ప్రకృతి సాగుతో ఖర్చులు తగ్గించుకుంటూ మంచి ఆదాయం గడిస్తున్నారు. చేపల చెరువులో 5 నెలల కిందట పది వేల శీలావతి, కొర్రమీను, రూప్ చంద్, బొత్స చేప పిల్లలను వేశారు. వీటిని రెండు టన్నుల మేర విక్రయించి రూ.1.7 లక్షలు పొందారు. ఇంకా చెరువులో 600 కేజీల చేపలు ఉండగా, వీటిని కిలో రూ.400 (కొర్రమీను) చొప్పున అమ్ముతున్నారు. ఇక వరి విషయానికి వస్తే 75 కేజీల వడ్లకు 56 కేజీల బియ్యం వస్తుండగా, ఆ నాణ్యమైన బియ్యాన్ని కిలో రూ.85 చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా ఏడాదికి ఫిష్ పాడీ మోడల్ ద్వారా 4 లక్షల దాకా.. మిగతా పొలంలో వరి సాగు ద్వారా రూ.11 లక్షల వరకు సంపాదిస్తున్నారు.

రసాయనాల్లేని పంట పండిస్తూ విదేశీయుల ప్రశంసలు అందుకుంటున్న ఆయన తన జ్ఞానాన్ని తోటి రైతులకు ఉచితంగా పంచుతున్నారు. ఇటీవలనే కెన్యాకు చెందిన ముగ్గురు ఈయన ఫిష్ పాడీ మోడల్ గురించి తెలుసుకోవడానికి వచ్చారు. 2007 నుంచి ప్రకృతి సేద్యం చేస్తున్న ఆయన 2019లో ఫిష్ పాడీ మోడల్‌కు రూపకల్పన చేశారు. గత 15 ఏళ్లుగా ప్రతి నెలా 9వ తేదీన తన పొలంలోనే రైతులు, ఆసక్తి ఉన్న వారికి ఉచితంగానే తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలి, ఫిష్ పాడీ మోడల్ ఎలా నిర్మించుకోవాలి అనే అంశాలను ఎంతో ఓపికగా వివరిస్తూ ఎందరికో మార్గదర్శకంగా నిలుస్తున్నారు. ■

**నిజాయితీ బాటలో నడవడంలో గొప్ప సౌకర్యం వుంది, ఆ దారిలో రద్దీ బాగా తక్కువ**

# కడప రైతు వరదారెడ్డికి ప్రధాని మోదీ కితాబు

కడప జిల్లాకు చెందిన ఓ సాధారణ రైతు ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. సంప్రదాయ పంటలకు భిన్నంగా అవకాడో సాగు చేస్తూ విజయం సాధించిన లింగాల మండలం వెలిదండ్ల గ్రామ రైతు కర్ణ వరదారెడ్డిని ప్రధాని మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో అభినందించారు. ఈయన స్ఫూర్తిదాయక ప్రస్థానాన్ని దేశ ప్రజలకు పరిచయం చేశారు.

ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "ఏళ్ల తరబడి టమాటా, అరటి వంటి పంటలు సాగు చేసిన వరదారెడ్డి, ఓసారి తన స్నేహితుడి పొలంలో అవకాడో పంటను చూశారు. ఆ తర్వాత యూట్యూబ్ ద్వారా సాగు వివరాలు తెలుసుకుని, విజయవంతంగా 4 టన్నుల దిగుబడి సాధించారు. స్థానిక మార్కెట్లకే నేరుగా సరఫరా చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. మన రైతుల నూతన ఆలోచనలు వ్యవసాయాన్ని లాభసాటిగా ఎలా మారుస్తున్నాయో చెప్పడానికి వరదారెడ్డి ఒక ప్రత్యక్ష ఉదాహరణ" అని కొనియాడారు.

ఈ సందర్భంగా రైతు వరదారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. "గతంలో సాగు చేసిన పంటలతో చాలా నష్టపోయాను. అందుకే అవకాడో సాగుకు మొగ్గుచూపాను. ఈ మొక్కలు ఎక్కడ దొరుకుతాయి, వాటికి వచ్చే తెగుళ్లు, వాడాల్సిన ఎరువులపై అవగాహన పెంచుకుని సాగు మొదలుపెట్టాను. నాలుగేళ్లకు ఒకటిన్నర టన్నుల దిగుబడి వచ్చింది. కిలో రూ.100 చొప్పున చుట్టుపక్కల ప్రాంతాల్లోనే విక్రయించాను. 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ నన్ను అభినందించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సంతోషాన్ని గ్రామ ప్రజలతో పంచుకున్నాను" అని ఆయన తెలిపారు. ■

# డిజిటల్ బాటలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ

రాష్ట్రంలో వ్యవసాయాన్ని పూర్తిగా డిజిటల్ బాట పట్టించేందుకు వ్యవసాయ శాఖ అగ్రిటెక్ సేవలను విస్తృతం చేసింది. వ్యవసాయ రంగం బలోపేతానికి సీఎం చంద్రబాబు నిర్దేశించిన పది సూత్రాల్లో అగ్రిటెక్ ఒకటి. డిజిటల్ సేవలపై రైతులకు అవగాహన కల్పించడం, వాటిని అందుబాటులోకి తేవడం, వాటి వినియోగం ద్వారా మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా వ్యవసాయ శాఖ ముందుకెళ్తోంది.

ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ (ఏపీఏఐఎంఎస్) అనే కొత్త యాప్‌ను వ్యవసాయ శాఖ రైతులకు అందుబాటులోకి తెచ్చింది. 'ఏపీఎయిమ్స్-2.0' యాప్‌ను రైతులు తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతోపాటు ఉపగ్రహ చిత్రాల ద్వారా పంటల ఆరోగ్యం, రియల్‌టైమ్‌లో వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, కిసాన్ డ్రోన్ సేవలు, యంత్ర పరికరాల సేవలను తేలిగ్గా తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. జాతీయ స్థాయిలో ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌తో అనుసంధానం చేస్తూ, కొత్త డిజిటల్ విధానాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ తీసుకొచ్చింది. ఈ విధానంలో రైతులు తమకు కావాల్సిన ఎరువుల్ని ముందుగానే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ప్రతి రైతుకు గరిష్ఠంగా 50 బస్తాల ఎరువులు అందేలా ఈ టెక్నాలజీ పని చేస్తుంది.

ఈ అధునాతన డిజిటల్ సేవలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు కావటానికి రైతు సేవా కేంద్రాల్లో పని చేసే సహాయకులకు ప్రత్యేకంగా ఆర్ఎస్‌కె అసిస్టెంట్స్ మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేశారు. ఈ యాప్ వాడకంలో గత 30 రోజుల్లో విశాఖ, అనకాపల్లి, తిరుపతి జిల్లాల సిబ్బంది 96 శాతం లాగిన్స్‌తో ఉత్తమ పనితీరు కనబర్చారు. ■

అణచివేతను ప్రతిఘటించడం మనిషి సహజ లక్షణం

# భూమి, నీటి సంరక్షణ మరియు యాజమాన్యం

భూమిలో సారం ... మొలకకు ఆధారం

కీలక దశలో అందే నీరే పెరిగే పంటకు జీవం

## చేపట్టే పనులు




NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HCD-1064/2024-26

*Publication Date:01-09-2026* Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 *Posting Date: 05/06-09-2026*



ఎన్ ఎం డి సి హైదరాబాద్ మారథాన్ లో పరుగో పరుగు ... ఏపిమాస్ వలంటీర్ల బృందం .. జ్ఞాపికలతో ....



తెలంగాణా ' సెర్ప్ ' ఎఫ్ పి ఓల ఏ పి ఎంలకు ఏపిమాస్ శిక్షణ : మరికొన్ని దృశ్యాలు



భైంసా మండలం దేగాం గ్రామంలో సామాజిక బోరు బావికి ప్రారంభోత్సవం ... రీ ఛార్జ్ సిస్టమ్‌కు భూమి పూజ



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ ... తాడిపత్రి ఎఫ్ పి ఓ వార్షిక మహాసభలో శ్రీ సి ఎస్ ప్రసంగం

To ADDRESS



తూర్పుగోదావరి జిల్లాస్థాయి 'వాష్' సమ్మేళనంలో జ్యోతి ప్రజ్వలన

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, పాట్ల్ నెం.11-12, హుడా కాలని,
తానీషానగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089